అవధాన పుష్కరిణి

అంతర్జాల మాసపత్రిక

సంపుటి: 1 సంచిక: 4 పుష్య శుద్ధ విదియ, 22 డిసెంబరు 2025



సాహితీ చరిత్రలో తొలి శతావధాని

కొలిచెలమ మల్లినాథయ్య

కాకతీయ ప్రభువు రెండవ ప్రతాపరుద్రుని (1295 - 1323) ఆస్థానకవిగా కనకాభిషేకము పొందినవారు.


అవధాన విద్యా విజయతే తరామ్

ప్రచురణ

అవధాన విద్యా వికాస పరిషత్

భాగ్యనగరం

శ్రీమాత్రేనమః





22 నవంబర్ 2025న హైదరాబాద్ బేగంపేటలోని పుష్పగిరి పీఠంలో
'అవధాన పుష్కరిణి' మూడవ సంచికను ఆవిష్కరిస్తున్న పుష్పగిరి పీఠాధిపతి
శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకర భారతీ స్వామివారు

అవధాన పుష్కరిణి

సంపుటి - 1 | అంతర్జాల మాస పత్రిక | సంచిక - 4

విశ్వావసు - పుష్యం 2025 22-12-2025 ప్రచురణ: అవధాన విద్యా వికాస పరిషత్

శ్రీయుతమై రసైకలహరీసితమై, వివిధావధాన వి
ద్యాయతధీకవీశ్వరులు తామరలై విరియన్ - త్వదీయ వి
జ్ఞేయ సుపద్యమాధురు లశేషబుధాళుల కిందు విందుగా
నీ యవధాన పుష్కరిణి - ఈప్సితమై వెలుగొందు నందమై

– డా. జి.యం.రామశర్మ, శతావధాని

కార్యాలయం
శ్రీరామ సదనం, 29-1499/6/1,
వెస్ట్ కాకతీయ నగర్, రోడ్ నం.1,
నేరేడుమెట్టు, సికిందరాబాద్ - 500 056
ఫోన్: 9441039146

అవధానవిద్యా విజయతే తరామ్ **సంపాదకీయం**

అవధాన పరత్వం

ఏ పనికైనా సావధాన చిత్తం అవసరం. అవధానపరత్వం లేనిది ఏదీ సాధించలేము. ఏకాగ్రత అన్నదానికి తెలంగాణలో చిన్నప్పటినుండి వింటున్న ఒకమాట వ్యాప్తిలో ఉంది. అది "ఒక్కచిత్తం" చేసుకోవడం. వ్యాకరణ పరంగా సంకరసమాసమైనా వాడుకలో బాగా నానిన మాట అది. "వాళ్ళ అమ్మాయి పెళ్ళి కుదిరి వానికి ఒక్కచిత్తమయింది". ఈ ఒక్క చిత్తమే సాహిత్యపరంగా అవధాన పరత్వంగా మలచుకొన్న ఘనత మన తెలుగు వాళ్ళదే.

సందర్భం ఏదైనా శ్రీనాథమహాకవి హరవిలాసంలో పార్వతీదేవి తపస్సు సందర్భంగా తల్లి మేనకాదేవి కూతురితో అవధాన పరత్వాన్ని గూర్చి చెప్పిన పద్యం గొప్పగా ఉంది.

ఎక్కడ లేరె వేల్పులు సమీప్సిత దాతలు, ముద్దు కూన! నీ
వెక్కడ? ఘోరవీర తపమెక్కడ? ఈ పటు సాహసిక్యముల్
తక్కు; శిరీష పుష్ప మవధాన పరత్వమనన్ మధువ్రతం
బెక్కిన నోర్చునో? విహగ మెక్కిన నోర్చునా? నిశ్చయింపుమా!


ఏకాగ్రత లేనిది ఏపనిలో ఎవరూ నిష్ణాతులు కాలేరు. మనోనిశ్చయమే అన్ని విజయాలకు మూలం. కుదురులేనితనమే నేటితరంలో ప్రతిచోటా కనిపిస్తుంది. చదువు సంస్కారాలు, ఉద్యోగ వ్యాపారాలు, సంబంధ బాంధవ్యాలు చివరికి సంసారాలు సైతం కుదురులేకనే చెదిరిపోతున్నాయి. విషయాంతర మనస్సంచారాన్ని నియంత్రించి చిత్తైకాగ్ర్యాన్ని పెంచేదే మన అవధాన విద్య. అందుకే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు చిన్నప్పటి నుంచే అవధానాలు చూపించి ఈ విద్యా వైశిష్ట్యాన్ని తెలిపితే ఎంతో కొంత మేలు కలుగుతుందన్నది సత్యం.

వచ్చే సంచికలలో చిత్తైకాగ్రతగురించి మరిన్ని విశేషాలను తెలుసుకుందాం.

ఇక మూడవ సంచికను పరమహంస పరివ్రాజకాచార్యులు పుష్పగిరి పీఠాధీశ్వరులు శ్రీమదభినవోద్దండ విద్యాశంకర భారతీస్వామివారు తమ పీఠంలో శ్రీ శారదాచంద్రమౌళీశ్వరుల సన్నిధిలో ఆవిష్కరించి అనుగ్రహించారు. అదే విధంగా శ్రీ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావుగారు రవీంద్రభారతిలోనూ సాహితీ విద్వన్మణుల సమక్షంలో విడుదల చేసారు.

మైసూర్ అవధూత దత్తపీఠంలో శ్రీ గణపతిసచ్చిదానందస్వామీజీ (అప్పాజీ) అవధాన పుష్కరిణిని ఆసాంతం తిలకించి ఆశీరమృతాన్ని కురిపించారు. ఇప్పుడు నాల్గవ సంచిక మీ చరవాణిలో ఉంది.

సంస్తుతి



శ్రీ సరస్వతీ స్తుతి

సీ॥ నిజశిరస్సిత కళానిధి సుధాలహరికి
జిలుగు పల్కుల కుల్కు చిందు నేర్ప
నిజశ్రవః కల్హార నిర్నిద్ర బంభర
ధ్వనికి వల్లకి పల్లవిని ఘటింప
నిజకరాంచిత కీర నినద గీతములకు
కంకణరుతి తాళగతుల గూర్ప
నిజపదాశ్రిత హంస నిస్వనస్ఫురణకు
గజ్జలందియలు రాగములు నేర్ప

తే.గీ. ఉపనిషచ్చేటికా కీర్తనోత్సవైక
సరణి గిలిగింతలిడగ కచ్ఛపిని మీటి
స్వరసమీహిత గీతికాస్వాదురీతి
నేలు శారద నాయెద జాలు గాత!

'శతావధాని' గండ్లూరి దత్తాత్రేయశర్మ

ఇదీ క్రమణిక

అవధాన పుష్కరిణి మూడవ సంచిక ఆవిష్కరణ

శ్రీశ్రీశ్రీ అభినవోద్దండ విద్యాశంకరభారతీస్వామివారి అనుగ్రహ భాషణం



శ్రీ గురుభ్యోన్నమః. పూర్వకాలం నుండీ అవధాన విద్యను ఆశ్రయించి మన పురాణాలు, ఇతిహాసాలు, కావ్యాలు వెలువడడం వల్లనే వాటిని మనం ఈనాటికి కూడా అధ్యయనం చేయగలుగుతున్నాం. మన పురాణాలన్నీ అష్టాదశ పద్మాలతో సమానమై, భారతదేశ సనాతన ధర్మ పుష్కరిణిలో ప్రమాణభూతంగా, సజీవంగా ఉండడానికి కారణం అవధాన విద్య. ధ్యానానికి, యోగానికి, దుఃఖనివారణకు, జీవితంలో ఉన్నతమైన ఏకైక ఆలోచనకు అవధాన విద్య ప్రధానం. మనలో వినూత్నమైన ఊహాశైలిని కల్పించడానికి, మన చుట్టూ జరుగుతున్న విషయాలను కూడా పద్యం, అథవా గద్య రచన చేయడానికి ఉపయుక్తమయ్యే విద్య అవధాన విద్య. "కావ్యశాస్త్ర వినోదేన కాలో గచ్ఛతి ధీమతామ్" ఒకప్పుడు కావ్యశాస్త్ర పఠనాలే వినోదదాయకాలు. అందువల్ల తిరిగి అటువంటి అవధాన విద్యా సౌరభాలను వెదజల్లడానికి అవధానంలో ఉద్దండులైన దత్తాత్రేయ శర్మగారు, ఆచార్యగారు అవధాన విద్యా శిక్షణ ఇవ్వడానికి కృషి చేస్తుండడం ప్రశంసనీయం. వీరు రాష్ట్రస్థాయిలో విద్యార్థుల చేత అవధాన ప్రదర్శనలు ఇప్పిస్తూ ఈ విద్యను పరివ్యాప్తం చేస్తున్నారు. ఇంకా 'అవధాన పుష్కరిణి' మాస సంచిక ద్వారా వయోనిమిత్తం లేకుండా అవధాన విద్యను అందరికీ అందుబాటులోకి తేవడానికి పూనుకున్నారు. ఇది అక్షయ విద్యా పుష్కరిణి. వీటిని చదివి, అవగాహన పెంచుకొని, ఈ అక్షర జలాలలో పునీతులై, భారతీయ ధర్మ పరిరక్షణ ప్రధానంగా ప్రతీ ఒక్కరూ వాఙ్మయ సరస్వతులు కావాలని, ఎల్లప్పుడూ వారికి ఆ సరస్వతీ మాత అనుగ్రహం కలగాలని కోరుకుంటున్నాను. కావ్య వినోదం ద్వారా తదనంతర తరాలకు మార్గనిర్దేశం చేయాలనుకున్న వీరి కోరిక సఫలీకృతం కావాలని ఆశిస్తూ, ఆశీర్వదిస్తున్నాను.

అవధాన కల్పవృక్షం

సత్కవి ప్రతిభకు తార్కాణం - సమస్యా పూరణం

– శతావధాని డా॥ జి.యం. రామశర్మ

20వ శతాబ్ది తెలుగు సాహిత్యాన్ని తమ ఉత్తమ ఆశు కవితావధాన విన్యాసాలతో సుసంపన్నం చేసిన పుంభావ సరస్వతులు, ఆశుకవి చక్రవర్తులు, అవధాన పంచాననులు కొప్పరపు సోదరకవులు – వారే కొప్పరపు వేంకట సుబ్బరాయకవి మరియు కొప్పరపు వేంకట రమణకవి. గుంటూరు జిల్లాలోని కొప్పరము గ్రామం ఈ సోదర కవుల జన్మచే అలంకృతము. ఈ కవిసోదరుల గృహనామము వారికి జన్మనిచ్చిన గ్రామము ఒకటే కావడం విశేషం. కొప్పర మంటే గోపురము, గోపురమంటే శిఖరము. ఇంటి పేరుకు తగ్గట్లుగా ఆ సోదర కవులు అవధాన సాహితీ జగతిలో సమున్నత శిఖరాయమానులై వెలిగారు. వారు తిరుపతి వేంకట కవులకు సమకాలికులే.



వారు గంటకు 500 పద్యాలు ఆశువుగా చెప్పగలిగేవారంటే మనకు ఆశ్చర్యంతో పాటు వారి అతిమానుషశక్తి సువ్యక్త మవుతుంది. లేఖకుల లేఖినులకు అందనంత అనర్గళ ఆశుధార వారిది. అందుకే ఆనాటి సాహితీ వ్రతులు వారి ఆశుధారా సుధా రాశిని ఆశుగ(బాణం) వేగంతోను, వాయువేగంతోను, నదీ వేగంతోను, మనోవేగంతోను పోల్చారు.

ఆంధ్రవాల్మీకి బిరుదాంచితులు శ్రీ వావిలికొలను సుబ్బారావు గారు – కొప్పరపు కవుల ఆశుకవితా వైఖరిని గూర్చి **'తడయరు ప్రశ్నంబడిగిన, దడవరు పల్కులకు గాగ దడబడరెపుడున్, నొడువుల మిడుకరు తోపక, వడివడి వచియింత్రు మున్ను వల్లించినటుల్'** – అంటూ కీర్తించారు.

సుప్రసిద్ధ తెలుగు వాఙ్మయ పరిశోధకులు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఆ సోదర కవులను 'ఆశుకవితోద్యద్రాజ్య పట్టాభిషిక్తులు' అని పేర్కొంటూ

శా॥ ఆలోచించుట లేదు కల్పనకు పద్యారంభయత్నమ్ము ము
న్నే లేదించుక ప్రాసకేని యతికేనిన్ గొంకు కన్పట్టదే
ఆలస్యంబును గల్గబోదు బళిరే! అయ్యారె యివ్వారికిన్
బాలే యౌ జుమి! ఆశుధార కవితాప్రారంభ నిర్వాహమున్

అంటూ శార్దూల వృత్తంలో ఆ కవి శార్దూలాలను ప్రస్తుతించారు.

కొప్పరపు కవులు సికింద్రాబాదు ఆల్వాలలో, మణికొండ సంస్థానంలోను, నెల్లూరు, చెన్నపట్టణం, కాకినాడ మొదలైన పలుచోట్ల శతాధికంగా ఆశుకవితాసభలు – గుంటూరు, జాగర్లమూడి, బాపట్ల, విశదల, చీరాల, పంగిడిగూడెం మున్నగు వివిధ ప్రాంతాలలో విరివిగా అష్టావధాన, శతావధానాలు చేసి ప్రతిభావంతులచే 'నహిప్రతి' అనిపించుకున్నారు. దైవ సంకల్పము(పద్యకావ్యము), సాధ్వీమాహాత్మ్యము(నాటకము), శ్రీ కరుణా ప్రభావము(వచన కావ్యం), సోమేశ్వర శతకము మున్నగు రచనలతో తెలుగు సాహితీ సమర్చన గావించారు. ఆ అవధాన పంచానసుల పద్యాంశ పూరణలు వారి అప్రతిహత పాండితీ ప్రకర్షకు నికషోపలాలు. వారికి ఒక అవధానంలో **'గరుడుడు గణపతికి తండ్రిగావలె జుమ్మీ!'** అను సమస్యనిచ్చి పూరించుమన్నారు. ఆ పూరణ ఇంత మనోహరంగా వచ్చింది.

కం.హరుడు గణపతికి వోలెన్
సరసీజాక్షుండు నాభిజన్మునకు వలెన్
గురుకీర్తి గన్న యా సా
గరు డుడుగణపతికి దండ్రి గావలె జుమ్మీ!

సమస్యలోని వైరుధ్యం సరసులందరికి సుపరిచితమే. సమస్యా పాదానికి ఆదిలో 'సా' చేర్చడంతో వైరుధ్యం తొలగి వైశిష్ట్యం ఏర్పడింది. సాగరుడు(సముద్రుడు), సాగరుడు+ఉడుగణపతికి (నక్షత్ర గణానికి పతియైన చంద్రునకు) అని వింగడింపు.

భావము: గణపతికి శివుని వలె, బ్రహ్మకు విష్ణువు వలె, గొప్ప కీర్తి గన్న సముద్రుడు చంద్రునకు తండ్రి గావలె సుమ్మీ! క్షీర సాగరమథన సందర్భంలో చంద్రుడు సముద్రంలోనుండి పుట్టాడనే పురాణ గాథ అందరికి తెలిసిందే కదా!

వారికే మరో అవధానంలో **'కమలబాంధవు దేతేర కలువ విచ్చె'** అను సమస్యనీయగా వారు హృదయంగమంగా పూరించారు.

తే.గీ: జంపతుల కాత్మమోదమ్ము సౌరు నింప
జారచోరుల గుండియల్ సంచలింప
విదిత రుచి మీఱ రోహిణీ హృదయ కమల
కమలబాంధవు దేతేర కలువ విచ్చె

(మిగతా 21వ పేజీలో)

అవధానకళా చరిత్ర 4

శతావధాని ఆముదాల మురళి

ఆగిరిపల్లి అవధానంలో సభను సరస్సుతో పోల్చమని పృచ్ఛకులు అడుగగా మాడభూషివారు ఈ క్రింది పద్యాన్ని చెప్పారు.

"స్థిరతర నిర్మల ప్రకట జీవనయుక్తి జగత్ప్రసిద్ధమై
సరసుల కెల్ల నుల్లసిలె సద్భటభూతియు జూడనొప్పె బె
క్కరసెను రాజహంస గమనాగమనంబులు నీగతిన్ సభాం
తర జలదాగమాంతము ముదంబొనగూరిచె నెల్లవారికిన్"

ఈ పద్యంలో సరసులు అంటే సరస్సు, శృంగారాది రసవివేచన కల్గినవారని, జీవనమంటే నీరు, బ్రతుకని, సద్భటులంటే రాజోద్యోగులని, రాజహంసలంటే హంసలేగాక రాజశ్రేష్ఠులని అర్థాంతర స్ఫురణగల్గిన పదాలను ఆచార్యుల వారు వాడి నిర్దిష్టార్థాన్ని సాధించారు.

మరో పృచ్ఛకుడు కూర్మావతారాన్ని ఇంద్రవజ్ర వృత్తంలో వర్ణించమని కోరగా చెప్పిన శ్లోకం ఇలా ఉంది.

"పద్మాయ మానస్య ధరాతలస్య
నాళాయతి స్మా హిపతిశ్చ తస్య
కందాయమానం కమఠాధిరాజం
ధ్యాయామి నిత్యం పరమార్థ దృష్ట్యా"

భూమి పద్మం, భూమిని మోస్తున్న శేషుడు మృణాళం, శేషునికి ఆధారమైన శ్రీకూర్మం మృణాళం యొక్క కందమూలం. పైకి కనిపించే ఆకర్షణీయ పద్మానికి ఆధారభూతమై అవ్యక్తంగా ఉన్నది కందమూలం (వేరుగడ్డ) చరాచర సృష్టికి ఆధారభూతుడై అదృశ్యంగా ఉన్న పరమాత్మ కూర్మస్వామిని ధ్యానిస్తానని శ్లోకార్థం. ఇందులో కల్పన అతిమనోహరమైనది. ఉపమానం నిరుమానమైనది. ఆశువులో ఇట్టి కల్పన అనన్యసాధ్యం.

వీరి భరతాభ్యుదయ కావ్యంలోది ఉద్యానవర్ణన ఇలా చేశారు.

"కామోత్సాహము గూర్చు సౌరభములున్ కాంతంబులౌపత్రముల్
స్వాముల్ మెచ్చగ జాలు జాతి తిలక స్వారస్యముల్ ధీరలో
కామోదప్రదపుష్పముల్ శుకమనోజ్ఞాలాపముల్ గల్గి యా
రామారత్నములట్టులెన్నదగి యారామంబు లొప్పున్ బురిన్"

ఈ పద్యంలో ఆరామారత్నమంటే గొప్ప ఉద్యానవనమని, రామారత్నమంటే ఉత్తమ స్త్రీ అని అర్థాంతర స్ఫురణ, దానికి అనుకూలమైన వర్ణన ఉన్నాయి. శుకమనోజ్ఞాలాపము లన్నప్పుడు ఉద్యానపక్షంలో చిలుకల యొక్క మనోజ్ఞాలాపములని, స్త్రీ పక్షంలో చిలుకవంటి మనోజ్ఞాలాపములని గ్రహించాలి. ఇటు అవధానంలోను అటు నిలకడ గల్గిన కావ్యరచనతోను శైలీభేదం కనిపించకుండా పద్యాలు చెప్పిన పండితకవి మాడభూషి వేంకటాచార్యులు. వీరి ఈ నిర్దుష్టప్రాతిపదికలు అవధాన వికాసానికి ఎంతో తోడ్పాటు నిచ్చాయి.

మాడభూషి వేంకటాచార్యుల వారు 1879 నవంబరు నెలలో పిఠాపురంలో రావు గంగాధర రామారావు గారి సమక్షంలో శతావధానం చేశారు. మాడభూషివారి ధారాధారణ ధిషణలకు ఆశ్చర్యపడిన జమీందారు వారిని సముచిత రీతిని సత్కరించారు. "మన ఆస్థానంలో ఇట్టివారున్నారా?" అని అడుగగా దేవులపల్లి సోదరుల ప్రస్తావన వచ్చింది. దేవులపల్లి సోదరులు మాడభూషి వారి అవధానాన్ని చూసి మరుసటి దినమే అవధానం చేశారు.

దేవులపల్లి సోదరకవులు

పిఠాపుర సంస్థాన విద్వాంసులు శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రులు. వారి కుమారులు శ్రీ దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి(1853-1909), శ్రీ దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రి (1856-1912). దేవులపల్లి వేంకటకృష్ణశాస్త్రికే తమ్మన్నశాస్త్రి అని పేరు, వీరిరువురు దేవులపల్లి సోదరకవులని వ్యవహరిస్తారు. భావకవిత్వోద్యమంలో కృష్ణపక్షం వంటి కావ్యాలు వ్రాసిన దేవులపల్లి కృష్ణశాస్త్రి తమ్మన్న శాస్త్రి కుమారులే. వీరిది పిఠాపురం సమీపంలోని చంద్రమపాళెం.

1879 నవంబరులో జరిగిన మాడభూషి వేంకటాచార్యుల పిఠాపురం అవధానాన్ని చూసిన మరునాడే అవధానం చేసిన ప్రతిభామూర్తులు దేవులపల్లి సోదరులు. ఈ అవధానం తర్వాత వీరు మద్రాసులో (19-2-1895), మైలాపూర్లో (8-11-1896), ఎడ్వర్డ్ ప్రభువు పట్టాభిషేక సందర్భంలో పిఠాపురంలో (1903), జె. అన్డ్రూ ఎదుట (16-12-1903), విద్యాధికారి ఎ.ఎల్. విలియమ్స్ ఎదుట అవధానాలు నిర్వహించారు.

వీరి అష్టావధానాలలో చదరంగము, సమస్య, వ్యస్తాక్షరి, నిషిద్ధాక్షరి, నిర్దిష్టాక్షరి లేదా ఉద్దిష్టాక్షరి, ఆశుధార, పుష్పగణనము, సంగీతము నందలి రాగముల గుర్తింపు, వర్ణన అనే ఎనిమిది అంశాలు ఉండేవి.

ఈ సోదరకవులలోని సుబ్బరాయశాస్త్రి 'మహేంద్రవిజయము', మల్హణస్తవం (ఆంధ్రీకరణము), కుమారశతకము (ఆంధ్రీకరణము) శ్రీరామపంచాశత్తు, శ్రీరావువంశముక్తావళి (సంస్కృతం), మందేశ్వర శతకము, రామరాయవిలాసము (తెలుగు) అనే గ్రంథాలను రచించారు. తమ్మన్నశాస్త్రి 'నయనోల్లాసము', 'యతిరాజ విజయము', 'సకలేశ్వర శతకము' అనే గ్రంథాలు రచించారు.

(సశేషం)

యయాతి చరిత్ర

డా. ఆచార్య ఫణీంద్ర



కడక నమీనుఖానుడు జగంబు తనుం బొగడంగ వేడ్కతో
విడువక యెప్పుడుం బుడమివేల్పుల బిడ్డల పెండ్లి చేయగా
నడరెడు బీతు లోబొడమ, నందు కతంబున గాడె దూరు బే
రడవుల లోపలన్ దబిసియై కనుపట్టెడు గాలి చూలియున్!

తొలి అచ్చ తెనుగు కబ్బం – "యయాతి చరిత్ర"లో అవతారిక లోని 33వ పద్యం ఇది. "పొనగంటి తెలగన" కవి – ఆనాటి చారిత్రక నేపథ్యంతో బాటు, కించిత్తు మతాతీత సుపరిపాలన ప్రశంస, కొంత హాస్యం, కొంత తాత్త్వికత మేళవించి అల్లిన పద్యం ఇది.



కృతికర్త తెలగన ఎత్తుబడిలోనే "అమీను ఖాను" అన్న మహమ్మదీయ నామానికి ప్రథమా విభక్తిలోని "డు" చేర్చి, "అమీను ఖానుడు" అని తెలుగు చేసి, ఆకట్టుకొంటాడు. "పుడమి వేల్పులు" అంటూ సంస్కృతంలో "భూసురులు" అని కొనియాడబడే "బ్రాహ్మణుల"ను తెలుగు చేసి పేర్కొన్నాడు. వాయుపుత్రుడైన ఆంజనేయునికి "గాలిచూలి" అని అచ్చతెనుగులో ఒక చక్కని పదబంధాన్ని రూపొందించాడు. "భీతి" అనే సంస్కృత "భయా"న్ని "బీతు" అని తెలుగు "భయం" గా మార్చాడు. ఇంకా... ఈ పద్యంలో – "కడక" (ప్రయత్నం); "లోబొడుమ" (లోపల కలుగగా); "తబిసి" (తపసి లేక ముని) వంటి అచ్చతెనుగు పదాలు ఆకర్షిస్తాయి.

ఇక పద్యంలోని సారాంశాన్ని గమనిద్దాం. అమీనుఖాను ప్రపంచమంతా తనను పొగడే విధంగా, ఉత్సాహంగా పట్టు విడువకుండా ప్రయత్నిస్తూ, ఒక పుణ్యకార్యంగా బ్రాహ్మణుల పిల్లలకు పెళ్ళిళ్ళు జరిపిస్తున్నాడట. అది చూచి వాయుపుత్రుడైన ఆంజనేయుడు అదిరిపోయి, బ్రహ్మచారియైన తన నెక్కడ పట్టుకొని పెళ్ళి చేస్తాడోనని భయం లోలోపల పొడమగా, ఆ కారణం చేతనే కదా .. దట్టమైన పెద్ద అడవులలో దూరి దాగుకొని, తపస్వీగా (అనగా.. తపస్సు చేసుకొంటూ) కనిపిస్తున్నాడు... అని కవి ఈ పద్యంలో –ఒక అద్భుతమైన కాల్పనిక దృశ్యాన్ని మన కళ్ళ ముందు నిలిపాడు.

అమీనుఖానుకు తన రాజ్యంలోని పేద బ్రాహ్మణుల పిల్లల పట్ల గల ప్రేమ, ఆదరణ, దాతృత్వ బుద్ధిని పొనగంటి తెలగన కవి ఎంత రమ్యంగా, చమత్కారంగా చిత్రించాడో.. దర్శిస్తుంటే – పాఠకులకు ఒకింత ఆశ్చర్యం, అమితానందం కూడ కలుగక పోదు. ఈ రోజు మన తెలుగు రాష్ట్రాలలో వింటున్న "కల్యాణ లక్ష్మి" పథకం వంటి ఆలోచన – ఆనాటి మహమ్మదీయ ప్రభువు అమీను ఖానుకు ఆనాడే కలుగడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఈ విషయం మనకు పొన్నగంటి తెలగన కవి విరచిత కావ్యం ద్వారా తెలియడం ఆనందదాయకం.

అయితే... చారిత్రకంగా మరియు భౌగోళికంగా పరిశీలిస్తే... ఈనాడు పటాంచెరువు చుట్టు ప్రక్కల అంటే... కేవలం నలభై మైళ్ళ దూరంలో ఒక ప్రాచీన (12వ శతాబ్దికి చెందిన) ఆంజనేయాలయం కర్మన్‌ఘాట్ లో ఉంది. ఇక్కడ ఆంజనేయ స్వామి అన్ని చోట్లలా నిల్చుని కాకుండా, కూర్చున్న మూల విరాట్టుగా ఉన్నాడు. అంటే స్వామి కూర్చొని తపస్సు చేసుకొంటున్నట్టుగా (తపస్విగా) భావించవచ్చు. ఈ విగ్రహాన్ని 12వ శతాబ్దిలో కాకతీయ (రెండవ) ప్రోలరాజు కర్మన్‌ఘాట్ ప్రాంతం (అప్పటికి అది దట్టమైన అడవి) లో వేటాడటానికి వెళ్ళినప్పుడు కనుగొన్నాడని చరిత్ర. ఆయనే ఆ తరువాత ఆ ఆలయాన్ని ఆ అడవిలో నిర్మించాడని ప్రతీతి. అయితే కర్మన్‌ఘాట్ ప్రాంతం 17వ శతాబ్ది వరకు నివాస యోగ్యంగా కాకుండా అడవిగానే ఉన్నట్టు పరిశోధనలో తేలింది. మరి ఈ కావ్యకర్త పొనగంటి తెలగనార్యుడు 16వ శతాబ్దికి చెందినవాడే కాబట్టి, కర్మన్‌ఘాట్ ఆంజనేయాలయం అప్పటికి ఇంకా అడవిలోనే ఉన్నట్టేగా! దీనిని బట్టి పటాంచెరువుకు అల్లంత దూరాన.. అప్పటికి అడవిగానే ఉన్న ఈ కర్మన్‌ఘాట్ ఆంజనేయాలయంలోనే కూర్చొని తపస్సు చేసుకొన్నట్టుగా ఉన్న ఆంజనేయుని గురించే ఇట్లా చమత్కారంగా ప్రస్తావించాడేమో అని మనం సంభావించవచ్చు.

ఇక ఈ పద్యంలో.. అమీను ఖాన్ బ్రాహ్మణుల బిడ్డలకు వివాహాలు జరిపిస్తుంటే.. కుల మతాలకు అతీతుడైన వానరుడగు ఆంజనేయుడు ఎందుకు భయపడ్డాడని సందేహం కలుగవచ్చు. కాను పొన్నగంటి కవి ఆంజనేయుడు తాను – సూర్యుని వద్ద విద్యలు నేర్చి బ్రహ్మ జ్ఞానిగా మారడం వలన, అమీను ఖాన్ ఎక్కడ తనను కూడ బ్రాహ్మణ పుత్రుడని పొరబడుతాడో అని భయపడి ఉంటాడని.. చమత్కరించినట్టుగా కనిపిస్తుంది. అంతే కాదు.. ఆంజనేయుణ్ణి "భావి బ్రహ్మ" గా పురాణాలు ఘోషిస్తున్న వాస్తవాన్ని కూడ కవి ఈ పద్యంలో అంతర్లీనంగా సూచించినట్టయింది.

ఏమైనా సునిశిత హాస్యంతో మిళితమైన ఈ తాత్త్విక కల్పన తెలగన కవిని అన్యుల కంటె ఒక మెట్టు పైన నిలబెడుతుంది అని చెప్పవచ్చు.

పద్యపరిమళం

- అన్నమరాజు ప్రభాకరరావు

వృత్తులు

3. సాత్త్వతీ వృత్తి

వీర, భయానక రసములను పోషించుట కనుకూలమైన వృత్తి. కొంత కోమల పదజాలమున్నను ప్రధానముగా ప్రౌఢ పదబంధురమై యల్పమును దీర్ఘమును కాని సమాసప్రయోగము కలిగి సులభగ్రాహ్యమై యుండును.

వ. భీముడు....... సురహస్తిహస్తానుకారంబులైన సవ్యదక్షిణ
హస్తంబుల నమ్మనుజకంటకు కటి కంఠప్రదేశంబులు
వట్టికొని (ఆది. 6-304)

ఉ. దారుణజానుదండ ఘనదండధరప్రతిముండు భీకరా
కారుడు వాని వీపు విఱుగం బొడిచెం బిశితంబుతో నవ
ద్వారములన్ మహారుధిరధారలు బోరన నొల్కి మాంసపం
కారుణవారి ఘోరనదులై పఱవన్ విపినాంతరంబునన్
(ఆది. 6-305)

ఇది బకాసుర వధ. ఐరావత తుండముతో సమానమైన తన రెండు చేతులతో బకాసురుని కంఠమును నడుమును పట్టుకొని భీముడైన భీముడు వాని వీపు విఱుగఁ బొడువగా వాని నవ ద్వారముల నుండి రక్తమాంసములు ధారలు కట్టి కాల్వలై యా యడవిలో ప్రవహించినవి.

ప్రౌఢ పద గుంఫితమై, నాతి దీర్ఘ సమాసములతో పద్యము చదువుచుండగనె భావము మనస్సునకు హత్తుకొని ఒడలు గగురు చెందునట్లుగా నీ పద్యమును నిర్వహించినాడు నన్నయ.

4. భారతీ వృత్తి

హాస్య, శాంత, అద్భుత రసముల నావిష్కరించుటకై యీ వృత్తి యవలంభింపబడును. కొంత ప్రౌఢము, కొంత సరళము నైన పదప్రయోగము, సందర్భోచితముగ నాతి దీర్ఘములైన సమాసప్రయోగములను కలిగి ఉంటుంది.

ఉ. స్థావరజంగమ ప్రవితతంబగు భూవలయంబు నెల్ల నా
లావును బూని తాల్తు, నవిలంఘ్య పయోధిజలంబు లెల్ల ర
త్నావళితోన చల్లుదు బృహన్నిజపక్షసమీరణంబునన్
దేవగణేశ ! యీ క్షణమ త్రిమ్మరి వత్తు ద్రివిష్టపంబులున్
(ఆది. 2-113)

స్థావరజంగమాదులతో విస్తరించిన యీ భూమండల మంతటినీ నా బలముతో ధరించగలను. నా రెక్కలతో మహా సముద్రములోని నీరమంతటినీ రత్నరాశులతో సహా వెలికి చల్లగలను. ఈ క్షణము లోననే మూడు లోకములను చుట్టి రాగల వేగము నాకు కలదు.

దేవతలను జయించి అమృతమును పొందిన గరుత్మంతు దద్భుతమైన తన బలపరాక్రమములు తెలియగోరిన దేవేంద్రునితో ప్రశాంత చిత్తముతో వినయముగా పలికిన పలుకులివి. తగిన విధముగనే నన్నయ్య రసభరితముగా నడిపించినాడు.

ఇదియొక విధముగ సాత్త్వతీ వృత్తి వలె కన్పించును. కానీ, ఇది శబ్దసంబంధ వృత్తి కాగా, నది అర్థ సంబంధమైనది.

ఇదీ తెలుగు సాహిత్యములో ప్రప్రథమముగా నన్నయ్య కావ్యవృత్తులు నిర్వహించిన విధానము. కవిత్రయములోని మిగిలినవారు దీనినందిపుచ్చుకొని సందర్భములను రసభరితము చేసినారు.

"రీతి రాత్మా కావ్యస్య" అనగా అక్షరముల మార్దవ కాఠిన్యములను బట్టియు, సమాసముల హ్రస్వ దీర్ఘత్వములను బట్టియు ఏర్పడిన రచనావిధానమగు "రీతి" కావ్యమునకు ఆత్మస్థానీయము అని "వామను"ని యభిమతము.

కవి వర్ణనీయ వస్తువు నందలి వివిధ సూక్ష్మాంశములను వర్ణించునప్పుడు లోక సహజమైన వివిధ పద్ధతుల నవలంబించ వలసి యుండును. వర్ణనీయము మృదువగుటయు, పరుష మగుటయు లేదా రెంటికిని మధ్యస్థితిలో నుండుటయు సంభవించును. ప్రియమైన వారితోను, శత్రువులతోను, తటస్థులైన సమానులతోను వ్యవహరించు విధానములలో వ్యత్యాస ముండును. ఆయా సందర్భముల కనుగుణముగా వాక్కు నందలి స్థాయీభేదము, ముఖకవళికలు, అంగవిక్షేపాదులు మారుచుండును. పఠనీయమగు కావ్యములలో నిట్టి "స్థితి వైవిధ్యము" నభివ్యక్తము చేయుటకు కవి రచనాగతమగు వైవిధ్యమును స్వీకరింపవలసి యుండును. అనగా వర్ణనీయ వస్తువు యొక్క స్థితి యందలి తారతమ్యమును సమర్థుడైన కవి "నిర్మాణ చాతుర్యము" చేతనే, "పదవిన్యాసము" చేతనే ఆవిష్కరించగలడు.

ఈ "వస్తుస్థితి వైవిధ్యము"ను వ్యక్తీకరించు విధానమునే "రీతి" యందురు. **(సశేషం)**

అవధానపుష్కరిణి అన్ని సంచికలూ ఒకేచోట. ఈ QR కోడ్ స్కాన్ చేస్తే అంతర్జాలంలో ఇప్పటివరకు వచ్చిన అన్ని సంచికలూ ఒకేచోట కనపడుతాయి. అక్కడే చదువుకోవచ్చు లేదా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

4

విశిష్ట తెలుగు భాషా వైభవం- ఛందః ప్రాముఖ్యం

- డా. సంగనభట్ల నరసయ్య

ఛందస్సు భాషాభివృద్ధిలో ఎలాంటి పాత్ర వహిస్తుందో చెప్పడానికి మరోక ప్రతిపాదన.

వచనంలో భావానుగుణ పదప్రయోగధారలో రచయిత స్వేచ్ఛగా సంచరించగా అదే రచయిత ఛందోబద్ధ రచనలో స్వేచ్ఛగా తనకొక సందర్భోచిత పదం స్ఫురించినా, అక్కడ గణ వ్యవస్థకు కదరనప్పుడు మరో ప్రత్యామ్నాయ (గణానుసారి) పదం గూర్చి ఆలోచిస్తాడు. మరొకసారి ఉత్కృష్టార్థాన్వేషణలో కూడా ప్రత్యామ్నాయ పదం కోసం ఆలోచిస్తాడు. ఇది ఒక్కోసారి పద్యం పూర్తి అయ్యాక కూడా సింహావలోకనం చేసి పదాల పర్యాయం గూర్చి ఆలోచించవచ్చు. కవికి, పాఠకునికి ఈ భాషాసంపన్నత, అభివృద్ధికి ఛందస్సే కారణం.

మాకొలది జానపదులకు
నీ కవనపు తీవియబ్బునే కూపనటత్
భేకములకు గగన ధునీ
శీకరముల చెమ్మ నంది సింగయతిమ్మా!

అని తెనాలి రామకృష్ణుడుచే భువనవిజయ సభాభవనంలో, రాయలవారు గగన బదులు నాక అనే పదం పెట్టమన్నారు. అది ఇంకా అనుప్రాస శోభతో "నాకధునీశీకర" అని అలరారింది. మన దరికి గగన- నాక అనే రెండు (పర్యాయ) పదాలు తెలిసాయి.

ఈ విధంగా పర్యాయపదాన్వేషణకు ఛందస్సు ఉపకరిస్తుంది.

పదిహేను వందల సంవత్సరాలుగా ఇవి తెలుగు భాషా వికాసానికి, తెలుగు వైభవం ప్రాభవాలకు అమేయమైన సహాయాన్ని, వైశద్యాన్ని, వైశారద్యాన్ని ఇచ్చాయి. తెలుగు జాతి గర్వంగా తలెత్తుకునేలా కవిత్వ చషకాలైనాయి.

గుడి కూలును, నుయి పూడును,
వడి నీళ్లను చెరువు తెగును, వనముల్ ఖిలమౌ,
చెడనిది పద్యం బొక్కటె
విడదీయని జాతిబద్ధ విద్యయె వినుమా!

ఛందస్సు ఆవిర్భావం

తెలుగు సాహిత్య విద్యార్థులకు ఛందస్సు, వ్యాకరణం భయపెట్టే శాస్త్రాలు. కాని సరియైన గురువు, సరియైన పాఠప్రవచనం లభిస్తే రెండూ ఒకటి ఆహ్లాదాన్ని, మరొకటి బుద్ధి, వికాసాన్ని పంచి యిచ్చే అంశాలు. ఇది చెప్పడం చేతగాని అధ్యాపకులు, స్నాతక, స్నాతకోత్తర(విశ్వవిద్యాలయ) స్థాయిల్లో వదిలేయమని, అక్కర్లేదని తప్పుడు సంకేతాలిస్తున్నారు. కాని ఇది సరియైన ఆలోచన కాదు ఇవిలేని సాహిత్యజ్ఞుడు అర్ధజ్ఞాని.

ఛందస్సంటే ఉచ్చారణాకాలన్ని కొలిచేశాస్త్రం(సాధనం). దేని ఉచ్చారణాకాలాన్ని కొలవాలి? పద్యం లేదా గేయాన్ని ఎందుకు కొలవాలి? ఒక పాదం ఎంత కాలంలో ఉచ్చరించగలమో తెలుసుకుని, అంతే కొలతగల మరో పాదం పేర్చడానికి అంతే కొలత ఎందుకు? కొలతలు సమానంగా ఉంటే, అంటే ఉచ్చారణ కాలం సమంగా ఉంటే కాలసౌష్ఠవంతో లయ పుడుతుంది కాబట్టి లయ ఎందుకు? లయవల్ల గేయం చదువుతే అర్థం కంటే ముందే వినడంలో ఆనందం కల్గుతుంది కాబట్టి. ఈ ఆనందం తాళబద్ధమై, నృత్యం చేయడాన్కి, వాద్యాలు అనుగుణంగా మోగించడానికి గుంపు అంతా ముక్తకంఠంతో గళ భేదం లేకుండా కోరస్ అందిచడాన్కి కారణం అవుతుంది. ఈ సామూహిక ఆనందంలో నుండి లేదా వైయక్తిక ఆనందంలో నుండి మనిషి విశ్రాంతిని, ప్రశాంతతను పొందుతాడు. ఛందస్సు పుట్టిననాటి స్థితి ఇది అందుకే 'ఛందయతి, ఆహ్లాదయ తీతి ఛందః' అని ప్రాచీనులు ఛందశ్శాస్త్రంలో దీనికి నిర్వచినం ఇచ్చారు. "శ్రవణ సౌఖ్యమ్మె లక్ష్యమ్ము".

కొలతలు లేని మాట-వచనం. కొలతలున్నది గేయం. గేయం క్రమవికాసంలో పద్యం ఐంది. పద్యం అంటే పాదాలున్న ఒక కొలత లేదా మూస. పద్యంలోని పత్ అనే సంజ్ఞ పాదమని, నడక అని అర్థాన్ని సూచిస్తుంది. పాదాల్లేనిది పద్యం/గేయం కాదు. వచనం అవుతుంది. వచనపద్యం అనే మాట 'హిమాగ్ని' అన్నట్టు అర్థం లేని మాట. ఛందస్సును వదిలి వచనకవిత్వం వ్రాసే ఆధునిక యుగంలో తమది కవిత్వమే అని చెప్పడానికి వచనపద్యం అనే మాట వాడినారు. ఇది వివాదాలకూ, చర్చలకూ దారి తీసి వచనపద్యం అంటే వారి ఉద్దేశ్యం వచనకవిత్వం. పద్యం లేకుండా ఛందస్సు లేకుండా కవిత్వం ఎలా? అనుకునే ఛందస్సును నిరాకరించిన తొలినాళ్ళ మానసిక స్థితికి ఆచ్ఛాదనం అది. పద్యమనే మాటకు అది అర్థవిస్తృతి.

(సశేషం)

కాశీలో దర్శనమ్ అవధాన సప్తకం

అవధాన-శిరోమణి

శ్రీ కాటేపల్లి లక్ష్మీనరసింహ మూర్తి గారి

అష్టావధానం 25.07.2025



ముఖ్య అతిథి: శతావధాని ఆముదాల మురళి

సంచాలకులు: సమస్యాపృచ్ఛక చక్రవర్తి కంది శంకరయ్య

నిషిద్ధాక్షరి: అవధానభీష్మ ముద్దు రాజయ్య

అంశము - శ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి శతావధాన వైభవము

(శ్రీ కాక మిగిలినవి) శ్రీ (క) శృ(త)ంగ(గ) స్థా(న)ద్రి(న)స్థి(త)ర (ఐ)దేశా(న)జ్ఞా(త)ధీ(శ)న(క)ర(క)స(క)నదీ (ప)గ(న)తి(న)గ(న)వ(డ)నిన్

శ్రీశృంగస్థాద్రిస్థిర
దేశాజ్ఞాధీన రసనదీ గతిగ వనిన్
ధీశాలి వద్దిపర్తి శు
భాశీస్సుల నీ వధానహర్షం బలరెన్!

సమస్య: పాతూరి సుబ్రహ్మణ్య కవి

శీతాంశుం ధరియించి దోషము గనెన్ శ్రీప్రీతుడై శర్వుడే!

మాతృప్రేమను విఘ్ననాయకుడు సంభావించెగా రాత్రిగాన్
భూతాధీశుని కేశసంపద గనన్ ముద్దార క్రీడింపగా
శీతాద్రీశుని పుత్రి పార్వతి మదిన్ సృష్టించె మోదమ్మునే
శీతాంశుం ధరియించి దోషము గనెన్ శ్రీప్రీతుడై శర్వుడే!

దత్తపది: కవిశ్రీ సత్తిబాబు

సరి - గమ - పద - నిస లతో శ్రీకృష్ణరాయబారము గురించి

సరిపడనట్టి వేళ తగు జాడల జూపగ కృష్ణమూర్తి రా
జ్యరమను బంచగా నిగమసారపు సూక్తుల కౌరవేంద్రుతో
కురుసభలోన నాపదల గూర్చిననైన సహించి పల్కె "స
త్వరముగ హాని సల్పని హితంబుల గూర్చుడు పాండవాళికిన్"!

న్యస్తాక్షరి: శ్రీమతి వాడపల్లి రాధ

రవి కవి పోలికలు.. చంపకమాలలో 1-11-ర, 2-8-వి, 3-1-క, 4-2-వి,

రవి జగమెల్ల గాచు సుకరమ్ముగ స్వాస్థ్యము నిచ్చు దేహికిన్,
కువలయ భాగ్యజీవికల గూర్చుచు వెల్గుల శక్తి నిచ్చుగా;
కవి కనుగా మనోజ్ఞ రసకాంతుల మానసవీధులందు పె
క్కు విధుల జీవులం దలపు గూర్చుచు సూర్యుని కాంతి బంచుగా!

వర్ణన: వై. వి. సుబ్రహ్మణ్యం

బలిపశువు మనోభావన

జీవాళిని శ్రీమాతగ
ధీవిద్యాబుద్ధు లీయ స్థిరమతి గొలువన్
జీవుల హింసింపదగునె?
నా విధి నన్నిట్లు చేసె నా గతి యిదియే!

ఆశువు: నేమాన వేంకటరమణ శర్మ

అంశము: రాసలీల

సంజవేళను కూడిన జలజనేత్రు
లైన గోపిక లెల్లర నాదరింప
బృందలో పలు రూపాల కృష్ణమూర్తి
రాసలీలల భక్తి నభ్యాస మిచ్చె!



ఛందోభాషణము: కంది శంకరయ్య

పృ: కాటేపల్లికులోద్భవా! కుశలమా?
అవ: కాంతిం గవుల్ గాచిరే:
పృ: మాట ల్నేర్చిన చిల్క మీ రట కదా?
అవ: మాత్రాజ్ఞనే పల్కెదన్,
మాటల్ నావి, మరెవ్వ రేమనిరొ?
పృ: మీ మాటల్ నిజం బందురే,
అవ: టాటా జెప్ప వధానవేదికను
దృష్టాంతమ్ము నే గంటినే!

అప్రస్తుత ప్రసంగం:

దండిభొట్ల దత్తాత్రేయ శర్మ.

చి. సంకీర్త్య శర్మ అష్టావధానం

వేదిక: మల్టీ పర్పస్ హాల్, కల్పతరువు రెసిడెన్సీ, ఎఱ్ఱగడ్డ, హైదరాబాద్ 05.12.2025

సంచాలకులు: 'అవధానార్చనభారతి' తటవర్తి కళ్యాణచక్రవర్తి

సమస్య: 'అష్టావధాని' డా. బోరెల్లి హర్ష

కుముదము పుట్టును సతతము కోర్కెలు దీరన్

కం. గమనము జూపగ వర్షము
సుమనముతో భూమి పండి శోకము దీర్చన్
సమరము లేకయె కృషికున
కు, ముదము పుట్టును సతతము కోర్కెలు దీరన్

దత్తపది: శ్రీమతి తంగిరాల నాగలక్ష్మి

చిత్తము, విత్తము, పొత్తము, వృత్తము - ఐసు క్రీము గురించి

ఉ. చిత్తము గల్గ జిహ్వకును చేరగ ప్రీతిని నైసుక్రీముకై
విత్తము గోరి తల్లిదరి ప్రేమగ జేర సుహాసవక్త్రునై
వృత్తములందు త్రిప్పుచును వేదన గల్గగజేసి యంతమున్
పొత్తముదీయుమంచు నను పొమ్మని బంపెను పాఠశాలకున్

వర్ణన: కొనింటి రమేష్

గురువు గారి సమక్షాన అవధానం చేస్తున్నప్పుడు మీ మనోభావాన్ని వర్ణించండి

ఉ. శారదమూర్తి సన్నిధిని చక్కగ జేయగ సద్వధానమున్
పూరణ జేయగా సురలు పూతము నొందుచు ప్రాశ్నికార్యులై
ప్రేరణ నిచ్చుచుండగను వేద్యమె పద్యముగాను వెల్గదా
కారణమైరి ప్రేక్షకులు కార్యమునే తిలకించ ధన్యుడన్

నిషిద్ధాక్షరి: 'అష్టావధాని' బాణోత్ నితిన్

గురువుగారు సభకు వచ్చి ఆశీర్వదిస్తున్నప్పుడు నీ భావన

కం. శ్రీమయవిద్యన్ బంచన్
ధామంబై వెతను గూల్చి తానే బోధన్
నా మనమునందు ముదమున
నేమంబున గొల్తు గురుని నిర్మలమూర్తిన్

న్యస్తాక్షరి : 'అష్టావధాని' గట్టెడి విశ్వంత్

1-1-అ, 2-2-వ, 3-11-ధా, 4-12-న

అవనిని ధర్మమార్గమున కద్భుతరీతిని తాను జాడయై
పవనసుతుండు గొల్చు ప్రభువై గురువై తెరువౌచు సర్వమై
స్తవములు జేయగా కృపను ధారగ నిచ్చిన రామచంద్రునిన్
కవనమునందు నేను గని గానము జేసెద భక్తి మీరగన్

ఆశువు: ఆదిత్యుని మురళీధర శర్మ

గాయత్రీ మాత వర్ణన

ఆ.వె. వేదమాత యగుచు వెలుగొంద భూమిపై
పంచముఖములే ప్రపంచమవగ
అందమైన రీతి వందనమ్ముల జేయ
ఆటవెలది యందు నందుకొనుమ

గోమాత వర్ణన

సకలదేవ స్వరూపమై జల్లు సిరులు
ధరణియందున గోవుగా పరగుచుండు
అట్టి తల్లిని గొల్వగా నన్ని దొరకు
పూజ చేసిన గల్గును పుణ్యఫలము

ఛందోభాషణం: చిత్రకవితాసమ్రాట్ చింతా రామకృష్ణారావు

శ్రీమన్మంగళ బాలభాస్కరుడవో? శ్రీమంత! నీవీ సభన్
'మీ మాధుర్యపు దీవెనల్ గొనుచునే మేలున్ గణింతున్ సదా'
ధీమంతా! గురుదేవునాజ్ఞ గొనుచున్ తేజంబు హెచ్చించితే?
'ధామంబై తమరుండగా సతతమే తాదాత్మ్యమున్ జెందెదన్'
అనితర హర్షవర్ధనుని ఆ నితినాఖ్యుని మార్గమెన్నుతే?
'విన,తమ మార్గమందునను వేడుకతోడుత నేను వచ్చెదన్'
ఘనముగ నెంచినావో నను?
'గర్వములేకనే పాద పూజకై'
ప్రణవమహా స్వరూపమయి
'వర్ధిలుచుండగ మిమ్ము గొల్చెదన్'



అప్రస్తుతం:

పంతుల విట్టుబాబు

నిఘంటు పరిజ్ఞానం

4 శతావధాని **ఆముదాల మురళి**

మిగిలిన రెండూ అవధానులకు అత్యంత ఉపయుక్తమైన నిఘంటువులు. ఏకాక్షరకోశంలో 38 శ్లోకాలున్నవి. ఈ లఘుకోశంలోని పదాలకు "ఆగమేభ్యామభిధానేభ్యః ధాతుభ్య శ్శబ్దశాసూత్ ఏవమేకాక్షరం నామాభిధానం క్రియతే మయా" అంటూ ఆగమాల నుండి నిఘంటువుల నుండి, ధాతువుల నుండి, వ్యాకరణం ద్వారా అర్థాలను సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నిఘంటువును హారావళితో చేర్చి వావిళ్ళవారు సటీకంగా 1951లో ముద్రించారు. నిషిద్ధాక్షరి నిర్వహించే సమయంలో అవధానికి ఈ ఏకాక్షరకోశము అత్యంతోపయోగి కాగలదు.

అకారో వాసుదేవస్స్యా దాకారస్తు పితామహః ।
పూజయా మపి మాంగల్యే ఆకారః పరికీర్తితః ॥ అని.

మొదటి శ్లోకం. అ అనగా విష్ణువు. అకారమునకు బ్రహ్మ, పూజ, మాంగల్యమని అర్థములు. దీనిని మరియు ఇమపగ దండనాథుడు రచించిన నానార్థరత్నమాలను ఆధారంగా చేసుకుని విద్వాన్ శ్రీ ముసుమూరి వేంకటశాస్త్రిగారు తాము కూర్చిన విద్యార్థి కల్పతరువులో ఏకాక్షర నిఘంటువును కూర్చియున్నారు. అందు 'అ'కారమునకు బ్రహ్మ, విష్ణువు, శివుడు, తాబేలు, ముంగలి, యుద్ధము, గొప్పతనము, అంతఃపురము, హేతువు, భూషణము, పాదము, పార్వతి, యజ్ఞము, చంద్రబింబము, గాయత్రి, చక్రము, కోడితల, బృహస్పతి, గాలి, సిగ, గుళ్ఖము, అనే 21 అర్థాలతో పాటు దీనిని అల్పార్థములోను, నిషేధార్థములోను వాడెదరని పేర్కొన్నారు. దీనిలో 122 అక్షరాలకు అర్థాలున్నవి. అందులో ఏవి అవ్యయాలో, వేటిని ఉపసర్గలుగా, ప్రత్యయాలుగా ఉపయోగించాలో కూడా పేర్కొన్నారు. అమరకోశంలో 98 ఏకాక్షరాలున్నవి. ఇందులో మరో 24 అదనంగా ఉన్నవి. 'అంబలి ద్వేషిణం వందే' ఇత్యాది శ్లోకంలో 'అంబలి' తెలుగు పదంగా అనిపిస్తుంది. కాని అక్కడ ఏకాక్షరమైన 'అ'ను తీసుకుని విష్ణువని అర్థం చెప్పాలి. ప్రథమైక వచనం 'అః' కాగా 'అం' ద్వితీయైక వచనం. బలిని శిక్షించిన విష్ణువునకు నమస్కారమని అర్థం. ఏకాక్షర ప్రయోగవిధానం వ్యాకరణ శాస్త్ర, పూర్వ ప్రయోగముల ద్వారా తెలియవలెను.

పురుషోత్తమ దేవుని నాల్గవ నిఘంటువు ద్విరూపకోశము. దీనికి శబ్దభేద ప్రకాశమని నామాంతరము కలదు. సమానార్థము కలిగి ఈషత్ భేదముతో ఉన్న పదాలు ఇందులో కూర్చబడినవి. కవిత్వరచనలో ఛందస్సు ప్రధానం కనుక అందులో గణభేదం కలిగించే రూపాలను తెలుసుకోవడం ఎంతైనా అవసరం. ఈ కోశమునందు 57 శ్లోకములున్నవి.

భవేత్ అమీర్ల అమార్షా అంకురోఽకుర ఏవచ ।
అంతరిక్షమంతరేక్ష మగస్త్యాఽగస్తి రేవచ ॥

అమర్ష యను పదము అమార్ష యని, అంతరిక్షము అనునది అంతరేక్షమని అగస్త్య అగస్తియని రూపభేదములతో ఉండునని తెలియవలెను. ఇట్టి వాని రూపభేదము తెలియనిచో ప్రయోగించిన పదము అసాధువని భ్రాంతి కలుగును. అట్టిదే మరొక శ్లోకం.

శబలం సబలం ప్రోక్తం కుశలం కుసలం తథా ।
వాశరో వాసరోఽపిస్యా ద్వశిష్ఠోఽపి వశిష్ఠకః ॥ అనగా

శబల పదమును సబల అని వ్రాసినా, కుశలమును కుసల అని వ్రాసినా అర్థం మారదు. రూపంలో భేదమే తప్ప అర్థంలో భేదం లేదు.

ఒకే రచయిత ఇలా నాలుగు విభిన్న నిఘంటువులను నిర్మించడం అరుదైన ఘనత. అట్టి ఘనతను సాధించిన ఏకైక పండితుడు పురుషోత్తమ దేవుడు. అదృష్టకరమైన విషయం ఏమిటంటే ఆయన వ్రాసిన నాలుగు నిఘంటువులూ నేటికి లభిస్తూ ఉండటమే. అవధాన విద్యార్థులకు ఈ నాలుగు అత్యంత ఉపయుక్తమై కోశములు. **(సశేషం)**

తటిల్లతలు

ప్ర: **ఆడువారికి పూలంటే ఎందుకండీ అంత ఇష్టం?**

స: వాడకుంటే బాగుండదని (వాడుకోకుంటే – వాడిపోకుంటే)

ప్ర: **క్షవరానికి, సవరానికి సామ్యముందా?**

స: క్షవరం తీసివేసేది – సవరం సవరించేది. (క్షవరం లేకుంటే సవరం తయారయ్యేది ఎట్లా)

ప్ర: **రావణునికి పది తలలు ఇరవై చేతులున్నాయి కదా – ఇరవై కాళ్ళు ఎందుకు లేవు?**

స: విరాట్పురుషిడికి వేలకాళ్ళు ఉండాలి, మరి కార్తవీర్యార్జునునికి ఎన్ని తలలు ఉండాలి.

(అష్టకాల నరసింహరామశర్మ గారి 'అవధాన సరస్వతి' నుండి)

పూరణతోరణం

నిర్వహణ: 'అష్టావధాని' కంది శంకరయ్య

సమస్య

"సరస మెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే"

అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు

నిరతము భార్య చర్యలను నిర్మల చిత్తము తోడ గాంచుచున్
స్థిరమగు ప్రేమ జూపుచును చేయుచు సాయము చిత్తశుద్ధితో
విరువిలుకాని చెయ్దముల ప్రీతినొసంగుచు, నన్య కాంతతో
సరస మెఱుంగ నట్టి పతి సన్నుతు లందెను ధర్మ పత్నిచే

ఆకుల శాంతిభూషణ్, వనపర్తి

తరుణియె కార్తికమ్మున వ్రతమ్మును భక్తిగఁ జేయఁ బూనుచున్
హర సతి నిష్ఠ గొల్వఁగ నహర్నిశలున్ఁ బతి దూరముంచగాఁ
బరువపు వాంఛలన్ని దిగవైచెను నాథుడు; నిట్టి వేళలో
సరస మెరుంగనట్టి పతి సన్నుతు లందెను ధర్మ పత్నిచే.

ఆకుల శివరాజలింగం, వనపర్తి

అరమర జేయకుండ కనకాభరణమ్ములు, బట్టు వస్త్రముల్
వరముగ నిచ్చుచుండి యతి ప్రాణముగా గనిపెట్టుచుండి తా
మురిపెము లాడుచుండి కడు మోహము నన్యుల గాంచ నత్తరిన్
సరసమెరుంగ నట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

ఎలుకంటి సందీప్ రెడ్డి, జగిత్యాల

స్థిరముగ ధ్యాన యోగముల శిక్షణ నేర్చుచు ధర్మబద్ధుడై
వరలుచు నాలు పిల్లలను బాధ్యతగా గను శీల వర్తుడై
పరసతులైన వారి యెడ పావన దృష్టిని నిల్పి వారితో
సరసమెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే!

కశోర్షుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి

నిరతిగ భర్త కూర్చొనక నెవ్వరిజోలికి బోక కోర్కెతోఁ
బరమ ముదంబుతోడ పరిపాటిగఁ జక్కగ దిద్దు కార్యముల్
విరమమునెంచకుండగను విత్తమునార్జన చేయు దీక్షగాన్
సరసమెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

కృష్ణ విరజ

పరుష పదంబు లెన్నటికి వాడక పత్నికిఁ బ్రేమఁ బంచుచున్
మరువము, సన్నజాజి, సిరి మల్లెల జల్లిన పాన్పు పర్చుచున్
నిరతము దన్నుగా నిలిచి, నిశ్చలుడై పర చంచలాక్షితో
సరసమెఱుంగనట్టి పతి సన్నుతు లందెను ధర్మపత్నిచే.

కొరిడె విశ్వనాథ శర్మ, ధర్మపురి

పరముగ దేశసేవలను పౌరులు తుష్టిగ మెచ్చురీతిగన్
నిరతము దైవచింతనను నిష్ఠగ జేయుచు ధర్మచారియై
పరసతిఁ జూడగా తలను వంచుచు సానుల మోహహీనుడై
సరసమెఱుంగనట్టి పతి సన్నుతు లందెను ధర్మపత్నిచే

కొరుప్రోలు రాధాకృష్ణ రావు

గరిపడు వాడుఁగాడు తనకష్టము నమ్ముచు సాగువాడుఁదా
నిరతము సత్యమార్గమున నీతిని దప్పకఁబోవువాడు మే
లరయుచు కాపురంబుననుఁహద్దులు మీరుచు సద్దుసేసెడిన్
సరసమెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

గట్టెడి విశ్వంత్, హైదరాబాద్

స్థిరముగ భార్య మానస వశీకృతగా నొనరించు, ప్రేమమై
వరలుచు నుండి రాగయుత వాక్కుల దగ్గఱి కౌగిలించు, ఏ
మరుచును ముద్దులాడిటుల మాన్యతనుండగ పల్కనెట్టులౌ
సరసమెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే ?

గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

మురిపెము మీరఁగన్ వలచి బొందియు భర్తగనందగాడినిన్
వరుని గుణంబునే తెలియఁ బంపఁగఁ బ్రాణసఖిన్ బరీక్షకున్
గురువరుఁదూర్వశీ లలనఁ గూడని స్వచ్ఛత నన్యకాంతతో
సరస మెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే!

గౌరీభట్ల అనిరుధ్ శర్మ, హైదరాబాద్

అరిగిన పార్థుడిన్ గలసి యప్సరసే తన వాంఛ దెల్పగా,
నిరతము నిగ్రహంబు గొని, నిందను మోపెను కాంత యాశ పై
జరిగిన వృత్తమున్ విని ప్రశంసగ నామమునిచ్చె, "స్త్రీలతో
సరసమెఱుంగనట్టి పతి", సన్నుతులందెను ధర్మపత్నిచే.

జి. లింగేశ్వర శర్మ, సిద్దిపేట

నిరతము స్నేహపూరితమునిర్మలనిశ్చలచిత్తవృత్తితో
తరతమభేదభావములుతప్పులనెంచకనిద్దరొక్కటై
మురిపెపుమాటలాడచునుమూర్ఖపువాదనలేనియట్టిదౌజి
సరసమెఱుంగనట్టిపతిసన్నుతులందెనుధర్మపత్నిచే.

డా. రఘుపతి శాస్త్రుల

కరమరుదైన రీతుల సకాలపు పూజలు దైవ ప్రార్థనల్
నిరతము జేసి పొందగ ననేక సిరుల్ బహుళార్థ సంపదల్
కరువును పోయి తృప్తి గని కల్మిని దారకు ధారవోయ నే
సరసమెఱుంగనట్టి పతి సన్నుతు లందెను ధర్మపత్నిచే.

డా. వేదాల గాయత్రీదేవి, హైదరాబాద్

నిరతము సాత్త్వికత్వమున, నిశ్చలభక్తి ప్రపూర్ణుడౌచు తా
పరుసము లాడబోడు గద, పట్టుగ భార్యకు ప్రేమ పంచడే
వరుసకు ఋష్యశృంగుడె, సువాక్కుల చాతురి గాంచి మెచ్చగా
సరసమెఱుంగనట్టి పతి, సన్నుతులందెను ధర్మపత్నితో.

ధనికొండ రవిప్రసాద్, హైదరాబాద్

సరసములైన పల్ కథల జక్కగ వ్రాయుచు, పల్ ప్రబంధముల్
వరుసగ వ్రాయు, భార్య తన ప్రక్కన నుండిన జూడదమ్మ! యా

పరువము మెచ్చదమ్మ! తన పద్యము లల్లుచు నుండు, భార్యతో
సరస మెరుంగ నట్టి పతి సన్నుతు లందెను ధర్మపత్నిచేన్.

పి.ఎల్. నాగేశ్వరరావు

నిరుపమ పండితోత్తముడు నిష్ఠగఁ జేయ వధానమున్ సదా
పరమ పవిత్ర కాశి చని పండిత చర్చల మున్గి దేలుచో
పరసతి మాయలం బడుచు పావన గంగను మున్కలేయకే
సరసమెఱుంగనట్టి పతి, సన్నుతు లందెను ధర్మపత్నిచే!

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

అరుసముఁ జూపి భర్త యటు లాదర ముంచుచుఁ దీర్చి సర్వదా
విరిసెడు భార్య కోరికలు వీడకఁ బ్రేముడి సంతు బాధ్యతల్
మరువక నెంచి వృద్ధిఁ గని మౌనముఁ దాల్చుచు నన్య కాంతపై
సరస మెఱుంగనట్టి పతిసన్నుతు లందెను ధర్మపత్నిచే!

బండకాడి అంజయ్య గౌడ్, హైదరాబాద్

స్థిరమతి, సత్యవాది గుణశీలుడు ధార్మికవేత్త, సుందరుం
డరయగ బాలచంద్రుడు, మహా మహితాన్విత బుద్ధిశాలి,వే
గిర పడబోడు నెప్పుడు సుకేశుడు ప్రాజ్ఞుడు నన్యభామినీ
సరస మెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మ పత్నిచే!

మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో.జిల్లా

సరసవచోవిలాసములు చక్కదనంబుగ సాగుచుండ తా
మురిపెముతోడ నిచ్చలును పూవులు దెచ్చి యలంకరించు కొ
ప్పరముగ కొప్పునందు పొరబాటుననైన మరన్యకాంతతో
సరసమెరుంగనట్టి పతి సన్నుతు లందెను ధర్మపత్నిచే.

మరింగంటి శ్రీనివాస్, హైదరాబాద్

వరుసకు బావయైన తన పాణిని బట్టిన నాడె నింటిలో
పరుషపు మాట లేవియును పల్కక నోటను మిన్నకుండుచున్
గరిటను తిప్పు వానిగ వకాలత నిచ్చిన భర్త యౌచు నే
సరస మెరుంగ నట్టి పతి సన్నుతు లందెను ధర్మ పత్నిచే.

మార్తాటి ఈశ్వరీ గోపాల రావు, సింగరాయకొండ

అరమర వీడి పత్నికి సహాయమొనర్చు మనస్సు గల్గితా
పరసతిగాంచి మాతయను భావనతోడ మెలంగువాఁడు కా
పురమును చక్కదిద్దుకొను పూరుష దుత్తమ బుద్ధిశాలి దు
స్సరసమెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

ముంజంపల్లి వీరబ్రహ్మేంద్రాచార్య, షాద్ నగర్

సరళత మందహాసమున, సాత్త్విక భావన పల్కులందునన్,
బరగెడు సుందరాంగనలు వచ్చి, మనోజ వికార చేష్టలన్
దిరుగుచు, ముద్దు ముచ్చటలు దీరుచు మన్నను దూరముండి, యే
సరస మెఱుంగనట్టి పతి సన్నుతు లందెను ధర్మపత్నిచే.

రాకుమార, గోదావరిఖని

మురిపెముగూరునార్జన సమున్నతకీర్తిగడించు నేర్పునన్
నిరతముకార్యసిద్ధినిమునింగి గృహంబునుచక్కదిద్దుచున్
పరమపవిత్రమౌ జననిభావనతో పరకాంతలందునన్
సరసమెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

(రామ) రాజేశ్వర శర్మ మల్కాచి, హైదరాబాద్

వరమను భావనంబునను పచ్చని పందిరిలోన వేడ్కతో
స్థిరమగు చిత్తవృత్తిని ద్వితీయగ చేకొని ప్రేమతోడుతన్
విరి సిరులందు ముంచి, పుర వీధుల భామల జూచి చిక్కనౌ
సరసమెఱుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

వేమరాజు వేంకట కృష్ణ కుమార్

పరిపరి చెందుచుండు మగవాని సహించుచు నారి సంతుకై
తరుణమునందు మానధని తా పతియే తన దైవమంచు నీ
ధర నిలబెట్ట గౌరవము దాస్యము పూజలు చేయ నేమియూ
సరసమెరుంగనట్టి పతిసన్నుతులందెను ధర్మపత్నిచే!

శిష్టా వి.ఎల్.ఎన్. శర్మ, హైదరాబాద్

దరిగొను నామె మానస సుధల్ కలబోసిన రమ్యరాగముల్
సరగున నింపు కోమల విశాల మనోజ్ఞ విలాస హేలలన్
వరమయి సంచరించు మృదు భావన లందునె, తద్విరుద్ధమౌ
సరస మెఱుంగనట్టి పతి, సన్నుతు లందెను ధర్మపత్నిచే!

శ్రీనివాస్ లింగం, దుబాయ్

సరియగు ధర్మమార్గమున చక్కగయుండి తదైక భక్తితో
నిరతము పూజలన్ సలిపి నీదయతో శశిశేఖరా! శివా!
విరివిగ దానమిచ్చి, పురవిప్రులఁగొల్చుచు నన్యులందునన్
సరసమెఱుంగనట్టిపతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

సందాపురం బిచ్చయ్య, నాగవరం, వనపర్తి జిల్లా

నరహరి రూపమెత్తి, మది నమ్మిన భక్తుల నేల లక్ష్మియే
హరునిది విల్లు ద్రుంచగను హారము వేసెను సీత వెంటనే,
గిరిధరుడయ్యి గోవులను, గీతను గీచియు మేప రుక్మిణే
సరసమెఱుంగ నట్టి పతి సన్నుతు లందె, ధర్మపత్నిచే.

కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు

హరి చరణారవింద నిరతార్చనమే విధిగా దలంచు నే
మరక నొనర్చు పూజలును మంత్ర జపంబులు భక్తి మీరగా
నెరుగ దధర్మ వర్తన గణించును తల్లిగ నన్య కాంతలన్
సరసమెరుంగనట్టి పతి సన్నుతులందెను ధర్మపత్నిచే.

సమస్య (పూరణలు 15 జనవరి 2026 లోపు పంపాలి)
నత్తిన్ గల్గినవాని వాక్పటిమ కర్ణప్రీతిఁ గూర్చున్ గదా

దత్తపది

'కరి, గిరి, దరి, సరి' పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ స్వేచ్ఛాఛందంలో గజేంద్రమోక్ష వర్ణన

అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి, హైదరాబాదు

తే.గీ. కరి వితతి సరోజిని కడ కరిగి ప్రీతి
లోనికిన్ సాగి రిపువు నెరుంగక వడి
జలమునఁ గొనుచునుండ వే సరి యయిన
కుంభి పట్ట బెదరి కావ గోరె హరిని.

ఆకుల శాంతిభూషణ్, వనపర్తి

చం. ద్విరదముఁ జిక్కఁ గుంభికిని వేదనచేఁ గడు ఘీంకరించుచున్
శరణని పిల్చె శ్రీ హరిని గారమునన్ఁ దన నాదరించగా
మొరవిని వేగిరించుచును భూమికి నేగి వధించె నక్రమున్
కరుణను గూడుఁ జూపులను కంబువుపై ప్రసరింప జేయుచున్.

ఆకుల శివరాజలింగం, వనపర్తి

తే.గీ. మకరి బాధల కోర్వక మత్తగజము
బెదరి హరిని వేడెను ప్రాణభీతి జెంది
వేగిరించుచు విచ్చేసె విష్ణుమూర్తి
కసరి మొసలి నడచి దంతి గావలేదె!

ఇరువింటి మాధురీదేవి

తే.గీ. మకరి నను పట్టె చెర దీయు మాన్యుడెవరు!
బెదరి యున్న నను నడుపు వీరు డెవరు!
యోగి! రిపుహరుడెవ్వరు! యుద్ధ భూమి
కేసరిని వేడెద శరణు! కీర్తనమున.

కటకం సూర్యనారాయణ మూర్తి, బెంగుళూరు

చం. మకరి కరాళదంష్ట్రముల మ్రగ్గి కృశించితినయ్య లేరు నా
కిక మరి వేరు దిక్కు జగదీశ్వర త్రాణమొసంగి రివ్వునన్
ప్రకటము గాగ నీ కృప విపన్నుని కంగద రిక్తమై జనన్
సకటుని బాపు మోర్వగ నశక్తుడ వేసరినాడ శ్రీహరీ!

కశోర్ఘుల నాగేశ్వర్ శర్మ, ధర్మపురి

కం. కరణీగుంపేగిరిట మ
కరి సరసికి యక్కరి ప్రభు కాంక్షలు మీఱన్
సరికడుచు పోరి జలమం
ద్దరిబేసి కడఁ కరి వేడె దామోదరునిన్.

కృష్ణ విరజ

తే.గీ. ఆర్త నాదముల్ వినిపించి హరి మ కరినిఁ
జంపి కరినిఁ గాచగ గిరి జాపతి సహ
విశ్వము దరిసించి స్తుతించ వేల మార్లు,
ప్రేమ దృక్కులు ప్రసరించె విష్ణుమూర్తి.

కొరుప్రోలు రాధాకృష్ణ రావు

మ.కో. మోకరిల్లిన హస్తిఁ గావగ ముందు నిల్చెను విష్ణువే
సాకులెంచక సాగిరిచ్చట శంఖచక్రములన్నియున్
పైకొనన్ దరిసింపగా మరి పత్నినిగ్గమనింపడే
నాకమంద గజేంద్రు డచ్చట నమ్మకంబుసరించగా.

గట్టెడి విశ్వంత్, హైదరాబాద్

ఉ. ఏను భరింపజాలను హరీ! మకరిన్ పరిమార్చి గావుమా
దీనుడ, మ్రగ్గిరింక భువి దీనుల బాధలు వెట్టువారు నీ
చే నతిహీనులై, ఇపుడు చిక్కితి నేనిటులాదరించుమా
శ్రీనయనాబ్జ బాంధవ, వచింపగ వేసరితిన్ గదే ప్రభూ.

గుండా వేంకట సుబ్బ సహదేవుడు, ప్రొద్దుటూరు

ఆ.వె. మకరిపీడితంపు మత్తేభమర్చింపఁ
జక్రహస్తుడెగిరి నక్రము తల
చెదరి విరిగి పడఁగఁ జేసి రక్షించెను
ముసరి యాయుధాలు కొసరవెంట

జి. లింగేశ్వర శర్మ, సిద్దిపేట

కం. గిరిధర నీవే దిక్కిక
దరి చేరియు భక్తపాల దైన్యము తొలగన్
సరియగు మార్గము జూపియు
కరి వేలుపు వేగ నన్ను గాపాడుమురా.

డా. రఘుపతి శాస్త్రుల

కం. శాం'కరి' నుతుడగు హరి ఆ
వంకను వే'సరి' గజమ్ము ప్రార్థింపంగా
సంకటము పాప నం'దరి'
అంకిలి ఏ'గిరి' సిరియు రయమ్మున సురలున్.

డా. వేదాల గాయత్రీదేవి, హైదరాబాద్

కం. కరిసించు శక్తితగ్గెను
సరిగొనుచుండెను మకరము సమయము లేదే
గిరిధరునేశరణమ్మన
దరితమునేబాపి బ్రోచె దంతిని హరియే.

ధనికొండ రవిప్రసాద్, హైదరాబాద్

ఉ. సేవకులందు నే యొకరి చెంతకు బిల్వడు, దైన్య నాద మే
దో విని యందరిన్ విడచి,యొక్క కరిన్ గరుణించి లక్ష్మికే
యే వివరమ్ము సుంతయు వచించక సాగి రివా రివన్ కరిన్
బ్రోవ జెలంగె జక్రి యతి రోషము జెందిన కేసరిన్ బలెన్.

పి.ఎల్. నాగేశ్వరరావు

సీ. కరి భయంకరి యౌచు కాలును మోపగ నీటనున్న మకరి నీరుగారి
ముందరి కాళ్లకు బంధము వేయుచు నోట బట్టఁ గరిని నీటనుండి
గడుసరి గజరాజు కన్నీటి మడుగున వేడఁ గాపాడ నా విరజునపుడు
కరి మొఱవిని హరి కావగ దరిజేరి యుగిరించె మకరికి నీప్సితములు!

తే.గీ. భాగవతమున పోతన భక్తితోడ
కరిమకరుల ఘట్టంబున గరిమనిల్పి
విష్ణుమాయను గల్పించి విశదబఱచి
గొప్ప సందేశ మొసగెను కువలయమున.

పెనుకొండ రామబ్రహ్మం, బెంగుళూరు

మ. కరిగెన్ వేడఁగ హస్తి మాధవుఁడు సంఘర్షించి నిస్త్రాణమై
హరితో సాగిరి యిందిరాదులటు లాహోయంచు నుద్విగ్నతన్
దరియించంగను గుంజరమ్ము మకరిన్ దానచ్చుటన్ ద్రెక్కొనెన్
ధరలో వేసరి శక్తి హెచ్చుఁగ హరిన్ ధ్యానించరే యార్తులై.

బండకాడి అంజయ్య గౌడ్, హైదరాబాద్

చం. మకరిని నొంచి హస్తిని రమాధవు దేలగ సంతసింపుచున్
సకల సురాదులున్ వొగడ సాగిరి వేడ్కగ నంచు నొక్కచో
ట కథను జెప్పె దాసరి నిటారుగ తంబుర మీటుచున్ భళా!
వికసిత పద్మనేత్రుడగు విష్ణువు భక్తుల నాదరించుగా!

మంకు శ్రీను, కొప్పర్రు, ప.గో.జిల్లా

తే.గీ. కరిని మకరి బట్టంగ చక్రమ్ము వేసి
హరి వధించె, పొంగిరి, సుర లాసమయము
నందు చంద్రుని సోదరి యైనలక్ష్మి
గడసరితనాన భర్తను కరము పొగిడె.

మార్తాటి ఈశ్వరీ గోపాల రావు, సింగరాయకొండ

చం. మడుగున నున్న యామకరి మత్తగజేంద్రునిఁబట్టి బల్మిచే
బెడఁదనుఁ బెట్టగా నదరి వేదనఁ జెందుచు నారమాపతిన్
గడువడి రివ్వునన్నెగిరి కావఁగరమ్ము! మహాత్మ! నీకిదే
వెడవని యంచునున్ విసరి వేయుము చక్రము శ్రీహరీయనెన్!

ముంజంపల్లి వీరబ్రహ్మేంద్రాచార్య, షాద్ నగర్

ఆ.వె. మకరి బాధ చెలగ, మత్తేభ మావేళ
నెగిరి పడుచు నా యుపేంద్రు వేడ,
సుందరిఁ రమ వీడి, బ్రమందించె మకరిని,
వేసరిన గజమ్ము చేసె నుతులు.

రాకుమార, గోదావరిఖని

తే.గీ. కఱకు కోరల మకరియు వెఱపు గొలుప
పరిపరివిధమున్ వేసరి శరణు గొనగ
కరుణయె దరిసెన సిరిగ వరమునొసగ
తరుణమెరిగికాచెకరిని గిరిధరుండు.

(రామ) రాజేశ్వర శర్మ మల్యాచి, హైదరాబాద్

కం. కరిగిన మనసున ప్రభు సా
గిరి తన లక్ష్మిని విడి కరి కేకలు వినగా
దరిసెనమిడి ముక్తికి కే
సరిగా మారిన మకరిని జక్రి వధించెన్.

శిష్టా వి.ఎల్.ఎన్. శర్మ, హైదరాబాద్

కం. కరిగెను హృదయము, శ్రీహరి
దరికేతెంచె గజరాజు దైన్యత ద్రుంచన్,
గిరికొను మకరిని దునుమగ
సరికడచెను, హరి కరుణను సద్గతి నొందెన్!

శ్రీనివాస్ లింగం, దుబాయ్

చం. తరుణిలమధ్యలోమకరిదాడినిచేయగ, శద్రి శక్తివీ
గి, రిపుని తాళలేక హరికీర్తిని మెచ్చుచు వేడినంతనే,
దరితముతొల్గనేనుగుకు, తక్షణసాయమునందచేసెలే
సరికొని చక్రి కుంభినినిఁజక్కనిభాగవతంబునన్ గదా!

సందాపురం బిచ్చయ్య, నాగవరం, వనపర్తి జిల్లా

తే.గీ. మనసు కరిగిన దేనుగు మనవి వినగ,
సోదరి సమంబు, భావించి సున్నితముగ,
నెగిరి పట్టిన మకరిని, నిష్టపూర్తి,
విసరి వేసెను జంపియు విష్ణు వపుడె.

దత్తపది: 'దోమ – ఈగ – చీమ – బల్లి' పదాలను అన్యార్థంలో ప్రయోగిస్తూ మత్తేభవృత్తంలో 'చరవాణి'పై పద్యం. (పూరణలు 15 జనవరి 2026 లోపు పంపాలి)

ఒక సవరణ – **పేరి రవికుమార్, విశాఖపట్టణం** **లేఖ**

నవంబరు సంచికలో **'పద్యకవిత్వము సాధుప్రయోగాలు-3'** అను వ్యాసములో ఒక సవరణ చేయవలెను.

"మనస్ స్థితి= మనస్థితి అనకూడదు. మనస్స్థితి, మనఃస్థితి అనాలి" – ఈ విధముగా వ్యాసమున ఉన్నది.

ఇక్కడ, మనస్థితి అను రూపము కూడ ఉండును. **వా శరి ।** అని సూత్రము వద్ద ఒక వార్తికము ఉన్నది.

"ఖర్పరే శరి వా విసర్గలోపో వక్తవ్యః ।"

విసర్గకు శర్ వర్ణములు (శ,ష,స) పరమై, వానికి ఖర్ వర్ణములు (క,చ,ట,త,ప,ఖ,ఛ,ఠ,థ,ఫ,శ,ష,స) పరమైనపుడు విసర్గకు లోపము వికల్పముగా వచ్చును.

రామః + స్థాతా= రామస్థాతా అని అగును. విసర్గ లోపించనిచో, రామస్స్థాతా, రామఃస్థాతా అని అగును.

కనుక మూడు రూపములు ఉండును.

కౌముదిలో ఇచ్చిన మరొక ఉదాహరణ, హరిః+స్ఫురతి.

ఇక్కడ కూడ మూడు రూపములు.

హరిస్ఫురతి, హరిస్స్ఫురతి, హరిఃస్ఫురతి అని ఉండును.

"పక్షే విసర్గే సత్వే చ త్రైరూప్యమ్।" అని కౌముదిలో వివరణ.

కావున, మనస్థితి అను రూపము కూడ సాధువే అగును.

పద్యకవిత్వము సాధుప్రయోగాలు - 4



- 'అష్టావధాని' చిటితోటి విజయకుమార్

స్త్రీప్రత్యయ దోషాలు

కొన్ని స్త్రీ వాచక పదాలకు "ఆ" చేర్చాలా లేక "ఈ" చేర్చాలా అనే సందేహం వస్తుంది. ఈ వ్యాసంలో ఈ సందేహానికి సంబంధించిన కొన్ని విషయాలు చూద్దాం.

(క) స్త్రీ వాచక పదం చివర్లో "ఆ" లేదా "ఈ" రెండూ వచ్చే శబ్దాలు.

1. స్వాంగవాచకాలు అంటే శరీరంలోని కొన్ని భాగాలు చివర్లో వచ్చే సమాసాలు.

ఉదాహరణకు చంద్రముఖీ – చంద్రముఖా ఈ రెండూ సాధు రూపాలే. ఇట్లే తామ్రముఖీ –తామ్రముఖా, సుకంఠీ – సుకంఠా, స్నిగ్ధకంఠీ – స్నిగ్ధకంఠా, మృద్వంగీ – మృద్వంగా. అయితే సుగాత్రా అనాలి కానీ సుగాత్రీ అనకూడదు అని కొందరు అంటారు.

అయితే శరీరం లోని ఒక అవయవం లేనిది అనే అర్థంలో పదం చివర "ఆ" వస్తుంది కానీ "ఈ" రాదు. ఉదాహరణకి వెంట్రుకలు లేనిది అన్నప్పుడు "అకేశా" అనాలి కానీ "అకేశీ" అనకూడదు. ముక్కు లేనిది అన్నప్పుడు "అనాసికా" అనాలి, అనాసికీ అనకూడదు.

2. నాసిక, ఉదర, ఓష్ఠ, జంఘ, దంత, కర్ణ, శృంగ శబ్దాలు చివర్లో ఉండేవి.

ఎత్తైన ముక్కు కలది (తుంగనాసికీ – తుంగనాసికా). ఇట్లే కుంభోదరీ – కుంభోదరా, బింబోష్ఠీ – బింబోష్ఠా, శుభ్రదంతీ – శుభ్రాదంతా, సుకర్ణీ–సుకర్ణా మొదలైనవి.

వీటికి అపవాదం. ఒక వ్యక్తి పేరు అయినప్పుడు నఖ, ముఖ పదాలు చివర్లో ఉంటే పదం చివర ఈకారం రాదు. చేటల వంటి గోళ్ళు కలది అనే అర్థంలో శూర్పనఖీ – శూర్పనఖా అనవచ్చు. కానీ ఒక వ్యక్తి పేరు అయినప్పుడు పదం చివర "ఆ" వస్తుంది కానీ "ఈ" రాదు. ఉదాహరణకు శూర్పణఖా (రావణుని చెల్లెలు, ఒక పేరు). ఈ పదానికి చేటల వంటి గోళ్ళు కలది అనే అర్థం చెప్పకూడదు. అంటే సమాసం లోని స్వపదాలతో విగ్రహవాక్యం చెప్పకూడదు.ఇది ఒక వ్యక్తి పేరు కనుక "పూర్వపదాత్ సంజ్ఞాయామగః" (అ. 8.4.3) అనే సూత్రం ప్రకారం ణత్వం వస్తుంది. ఇట్లే చంద్రుని వంటి ముఖం కలది అనే అర్థం లేనప్పుడు, కేవలం ఒక స్త్రీ పేరు అయినప్పుడు చంద్రముఖా అని మాత్రమే అనాలి.

మరో అపవాదం.

పెద్ద నాలుక కలది అనే అర్థంలో దీర్ఘజిహ్వీ అనాలి కాని, దీర్ఘజిహ్వా అనకూడదు. దీనికి ఈకారం చివర్లో వస్తుంది.

అయితే మొసలి దంష్ట్రల వంటి దంష్ట్రలు కలది అనే అర్థంలో మకరదంష్ట్రా అనాలి కానీ మకరదంష్ట్రీ అనకూడదు. ఇట్లే విషదంష్ట్రా అనాలి కానీ విషదంష్ట్రీ అనకూడదు. ఇట్లే అశ్వదంష్ట్రా, సర్పదంష్ట్రా మొదలైన పదాలు. వీటికి ఆకారం చివర్లో వస్తుంది.

(ఖ) "ఆ"కారం చివర్లో ఉండే స్త్రీ వాచక పదాలు – నయన, నేత్ర చివర్లో ఉన్న పదాలకు స్త్రీవాచకంలో ఆకారం వస్తుంది కానీ ఈ కారం రాదు.

ఉదాహరణకు పద్మనేత్రా అనాలి కానీ పద్మనేత్రి అనకూడదు. ఇలాగే ఏణీనేత్రా, కురంగనేత్రా, చకోరనేత్రా, చారునేత్రా, మీననేత్రా, సరోజనేత్రా మొదలైన పదాలు. ఇట్లే పద్మనయనా అనాలి కానీ పద్మనయనీ అనకూడదు. ఇలాగే కువలయ నయనా, పంకజనయనా, మదిరనయనా మొదలైన పదాలు.

(గ) "ఇకారం, ఈకారం" చివర్లో ఉండే స్త్రీ వాచక పదాలు– పద్మగంధం వంటి గంధం గల స్త్రీ అన్నప్పుడు – ఇకారం చివర్లో వచ్చి పద్మగంధగంధి అవుతుంది. మధ్యమపదం లోపించి పద్మగంధి అవుతుంది. దీనినే ఉపమానపూర్వపద ఉత్తరపదలోప బహువ్రీహి సమాసం అంటారు. ఇలాగే మీనగంధి మొదలైన పదాలు.

కొన్ని పదాలకు ఆనుక్ ఆగమం, ఆపై జీష్ ప్రత్యయం వస్తాయి. ఉదాహరణకు ఇంద్రాణీ, వరుణానీ, భవానీ, శర్వాణీ, రుద్రాణీ, మృడానీ, మాతులానీ, ఆచార్యానీ మొదలైన పదాలు. "ఆనుక్" వలన భార్య అనే అర్థం వచ్చి ఇంద్రాణీ (ఇంద్ర + ఆన్ + ఈ) అంటే ఇంద్రుని భార్య మొదలైన అర్థాలు వస్తాయి.

స్త్రీవాచకాలకు చివర్లో అక్షి వస్తుంది కానీ అక్ష శబ్దం రాదు. మృగాక్షీ అనాలి కానీ మృగాక్షా అనకూడదు. ఇట్లే పద్మాక్షి, సారసాక్షి మొదలైన పదాలు.

వయసులోని ప్రథమ, ద్వితీయ అవస్థలను సూచించే స్త్రీవాచకానికి ఈకారం వస్తుంది. కుమారీ, వధూటీ. కానీ బాలికను బాలా అని కన్యను కన్యా అని అనాలి. వృద్ధ స్త్రీని స్థవిరా, వృద్ధా అనాలి.ఈ శబ్దాలకు చివర్లో ఈకారం రాదు. (సశేషం)

4 వ్యాకరణ వరివస్య

ఎన్.సిహెచ్. చక్రవర్తి

తెలుగులో అక్షరాల విషయం చెప్పుకునేటప్పుడు చ, జ ల విషయం ప్రత్యేకంగా కొంత చెప్పుకోవాలి.

తెలుగులో చ, జ లు దంత్యము, తాలవ్యము అని రెండు విధాలుగా ఉంటాయి.. ఈ దంత్య, తాలవ్యభేదం ఆ అక్షరాలు పలకడంలో ఉన్న తేడా. సంస్కృతంలో చ,జ ల ఉచ్చారణలో ఈ దంత్య తాలవ్యభేదం లేదు. అన్నీ తాలవ్య చ,జ లే. దంత్య భేదం అనేది ఒకటి కేవలం తెలుగుపదాలకు మాత్రమే వర్తిస్తుంది. సంస్కృతంలో తాలవ్యాలే ఉంటాయి అని చెప్పుకున్నాం కనుక తత్సమ పదాలలో ఉండే చ, జ లు అన్నీ తాలవ్యాలే.

అయితే ఏ ఏ సందర్భాలలో తెలుగు పదాలలో చ,జ లు తాలవ్యాలు అవుతాయి? ఎక్కడెక్కడ దంత్యాలు అవుతాయి అన్నది చిన్నయ సూరిగారు సంజ్ఞాపరిచ్ఛేదంలో 8, 9 సూత్రాలలో వివరించారు.

ఇ, ఈ, ఎ, ఏ అనే అచ్చులతో కూడిన చ, జ లు తాలవ్యాలు అవుతాయి. **చిలుక, చీమ, చెలి, చేమ, జిల, జీడి, జెర్రి, జేజ** మొదలైన పదాలలో ఉన్న చ, జ లు తాలవ్యాలు.

అ, ఆ, ఉ, ఊ, ఒ, ఓ, ఔ అనే అచ్చులతో కూడిన చ, జ లు దంత్యాలు. **చలి, చాప, చుక్క, చూపు, చొక్కు, చోటు,చౌక, జముడు, జాతర, జున్ను, జూలు, జొన్న, జోలి, జౌకు** మొదలైన పదాలలో ఉన్న చ, జ లు అన్నీ దంత్యాలు.

ఈ కీలకమైన సూత్రాలను గుర్తుంచుకోవాలి. పైన ఉదాహరణలలో చెప్పుకున్న పదాలు అన్నీ తెలుగు పదాలుగా గ్రహించాలి.

ఇప్పుడు మనం చెప్పుకున్న (దంత్య) చ, జ పరుషాలు అవుతాయా? సరళాలు అవుతాయా? అని సందేహం వస్తుంది.

దంత్య తాలవ్యంబులైన చ,జ లు సవర్ణంబులు అని చిన్నయసూరిగారు సంజ్ఞాపరిచ్ఛేదంలో చెప్పడం వల్ల వీటిని పరుషాలుగా గ్రహించాలి. అందుకు చిన్నయసూరిగారే సంధిపరిచ్ఛేదంలో ఉదాహరణలలో పరుషాలు గసడదవలుగా మారుతాయి అని చెప్పే సందర్భంలో అపుడు + చేసియె = అపుడు సేసియె అనే ఉదాహరణ ఇచ్చి (దంత్య) చ పరుషమే అని స్పష్టంగా చెప్పారు.

ఈ విధంగా ఉచ్చారణ పరంగా తెలుగులోచ, జ లు దంత్య, తాలవ్య భేదాలతో ద్వివిధాలు అని తెలుసుకున్నాం. **(సశేషం)**

పద్యపరిమళం

కరిముఖు దశ్వినుల్ శ్రుతులు,కంజ సముద్భవు మోము, లంబికే
శ్వరు మొగముల్ తదాత్మజుని వక్త్రము లాది మునీంద్ర మండలం
బురగపతుల్ గ్రహంబులు,పయోరుహనాభుడు తారకంబులున్
బొరిబొరి నెల్ల సంపదలు పోలమగుండని కిచ్చు గావుతన్

ఈ పద్యం మంచన కవి రచించిన కేయూర బాహు చరిత్రము అనే కావ్యం లోనిది. ఒక సంస్కృత నాటకానికి అనుసరణగా వచ్చిన తొలి తెలుగు శ్రవ్య కావ్యం.సంస్కృతమున రాజశేఖరుడు రచించిన విద్ధ సాల భంజిక అను నాటకం దీనికి మూలం. క్రీ.శ 1300సం. ప్రాంతమువాడుగా భావించబడుతున్న ఈ కవి విరచితమైన ఈ కావ్యంలో ప్రసిద్ధమైన పోతన "బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకన్" అనే పద్యం కనబడుతుంది. అంటే ఈ పద్యం పోతన భాగవతంలో ప్రక్షిప్త మైనదే తప్ప పోతన వ్రాసినది కాదని భావించవచ్చు.

కావ్యారంభంలో రెండవ పద్యమే ఇది. ఇష్టదేవతాస్తుతి. ఒక్కొక్క పద్యంలో ఒక్కొక్క దేవుని స్తుతించే సంప్రదాయం సాధారణంగా మన కావ్యాలలో కనబడుతుంది. కానీ రెండవ పద్యంలోనే కరిముఖుని దగ్గర నుండి పయోరుహనాభుని వరకు పది మందిని ఒకేసారి స్తుతించడంలోని పరమార్థ మేమిటని తీవ్రంగా ఆలోచించగా ఈ పద్యంలోని శ్లేష అర్థమైంది. ఇది సంఖ్యల పద్యం. కరిముఖుడు ఏకదంతుడు కాబట్టి అది ఒకటిని, అశ్విని దేవతలు ఇరువురు కాబట్టి ఇది రెండును, అలాగే త్రయీ విద్య అని చెప్పబడే శ్రుతులు మూడు, కంజసముద్భవుడు బ్రహ్మ అతని మోములు నాలుగు,అంబికేశ్వరుడు అంటే శంకరుడు అతని మోములు ఐదు, అతని పుత్రుడు కుమారస్వామి ముఖములు ఆరు, ఆది మునీంద్రులు సప్తర్షులు ఏడు, ఉరగపతులు అనే అష్ట నాగులు (అనంతుడు, కుళికుడు, వాసుకి, శంఖపాలుడు, తక్షకుడు, పద్ముడు, మహాపద్ముడు, కర్కోటకుడు) ఎనిమిది, గ్రహంబులు తొమ్మిది, పయోరుహనాభుడు అంటే విష్ణువు అతని అవతారాలు పది. ఇలా 1,2,3..10, కొనసాగి అనంతమైన (తారకలు) సంపదలు కృతిభర్త పోలమగుండనికి ఆయా దేవతలు ఇచ్చుదురు గాక అనునది ఈ పద్య భావం.

అంతే కాక ఈ పదీ ఆయురారోగ్య అష్టైశ్వర్యాలు అవుతాయి. వీటిని దేవతలు ప్రసాదించుగాక అని కవి ప్రార్థన.

-చేపూరి శ్రీరాం

గర్భకవిత్వము

కవిత్వము చతుర్విధములు. ప్రాచీనాంధ్ర లక్షణకర్తలు ఆశు – మధుర – చిత్ర – విస్తర అని కవిత్వమును వివరించారు. ఈ చతుర్విధ కవిత్వము చెప్పగలుగుటయే కవి పరిపూర్ణతా లక్షణముగా అభిప్రాయము కుదురుకొన్నది.

అప్పకవి తన అప్పకవీయము 4వ ఆశ్వాసములో 549 వ పద్యమునుండి 608వ పద్యము వరకు చిత్రకవిత్వానికి సంబంధించిన చిత్ర కవిత్వము, బంధకవిత్వము, గర్భకవిత్వము వివరించాడు.

ఆ.వె. మృదుల కవితరీతి మేదురమౌ చిత్ర
కవితగూడ కవికిఁ గాంక్షఁ గొలుపు
పూలదండ యట్లు ముత్యాలదండయుఁ
గన్నులున్న వాన్కిఁ గాంక్ష నిడదె?

అని శ్రీ విక్రాల శేషాచార్యులు చిత్రకవితను ప్రశంసించారు.

కవిత్వమనేది మామూలు మాటలతో చెప్పుకొంటూపోతే అతి పేలవంగా ఉండి అందులో కవితామృతము స్రవించదు. కావుననే కావ్యము ధ్వని ప్రధానమైనదని, కావ్యమునకు ఆత్మ ధ్వని యని లాక్షణికులు వక్కాణించారు.

అర్థాలంకారములు, శబ్దాలంకారములు, ఏ విధంగా కావ్యకాంతకు తొడవులో, అదే విధంగా శబ్దచమత్కారము, అర్థచమత్కారము, పాఠకుల మనసును ఆనందపారవశ్యానికి లోనయ్యేటట్లు చేస్తాయి. రచనలో చిత్రకవిత్వముకన్నా గొప్పగా మరొకటి చమత్కారాన్ని కలిగించదంటే అది అత్యుక్తి కానేరదు.

ప్రస్తుతం గర్భకవిత్వమును తెలుసుకొనే ప్రయత్నము చేద్దాం.

లక్షణబద్ధమైన వృత్తపద్యము పఠించడానికైనా, ఆలపించ డానికైనా ఎంతో మనోరంజకంగా ఉంటుంది. దానికి తోడు అదే వృత్తంలో మరొక కందపద్యమో లేక అనేక కందపద్యములో, గీతపద్యమో భావ సారూప్యతతో కాని, భావవైవిధ్యంతో కాని రచింపబడితే చదువడానికి ఆసక్తి చూపని సహృదయపాఠకుడు ఉంటాడా? అలాగే ప్రకటింపబడిన ఒక పద్యంలో మరొక ఛందస్సు సలక్షణముగా పొదిగి ఉందని చూపిస్తే ఎవరికి ఆశ్చర్యం కలిగించదు?

నేను అనువదించి నా తల్లిదండ్రులకు అంకితము చేసిన శ్రీమద్భగవద్గీత మొదటి అధ్యాయంలో 47వ శ్లోక అనువాదాన్ని గమనించండి.

సంజయ ఉవాచ – సంజయుఁడు ఇట్లు పలికెను.

శ్లో. ఏవముక్త్వార్జునః సఙ్ఖ్యే రథోపస్థ ఉపావిశత్ ।
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః ॥ 1-47

తే.గీ. అని పలికి యర్జునుండట మనమున విల
పించుచు ఖిల మానసుడయి, భీతిని హరి
నుడువులు రథమును విన కను దిగి యమ్ము
లు నిక విల్లు విడిచె, హా మదినికలగుచు.

ఈ తేటగీతిలోనే కందపద్యం చక్కగా ఇమిడి ఉందంటే నమ్మకుండా ఎలా ఉండగలరు? పరికించండి.

కం. అని పలికి యర్జునుండట
మనమున విలపించుచు ఖిల మానసుడయి, భీ
తిని హరి నుడువులు (రథమును)
వినకయె దిగి, యమ్ములు నిక విల్లు విడిచె, హా!

భావము: సంజయుడు ఇట్లుపలికెను. అర్జునుడు ఇట్లు పలికి శోకముతో నిండి యున్న మనస్సుతో యుద్ధభూమిలో బాణములతో సహాధనుస్సును వదిలి రథము వెనుక భాగములో కూర్చొనెను.

ఇందులో భావవైరుద్ధ్యము లేదు. ఇందలి చమత్కారమేమనగా తేటగీతి ఎలా ఉన్నదో కందమూ అలాగే ఉన్నది. ఇట్టి చమత్కారాలు చిత్రకవిత్వములో కోకొల్లలుగా ఉన్నాయంటే ఆశ్చర్యపడనక్కరలేదు.

- చింతా రామకృష్ణారావు.

ప్రహేళికా

కవుల మాటలకు – సందర్భాన్ని బట్టి ఛలోక్తులు, హాస్యోక్తులు, వ్యంగ్యోక్తులు అమితానందాన్ని కలుగజేస్తాయి. ఒక్కోసారి ఒక్క అక్షరంతోనే ఆ పదాలలోని అర్థాలు మారి, అందాన్ని కలిగింపజేసి, మానసిక ఆనందాన్ని వికసింపజేస్తాయి.

ఒక కవి ఒక గ్రామం నుండి మరొక గ్రామానికి నడిచి వెళ్తున్నాడు. ఎండాకాలం, దాహం వేస్తోంది. ఒక బావి దగ్గర ఒక వనిత నీళ్ళు తోడుతూ కనిపిస్తుంది. ఆ కాలంలో జనులకు అందరికీ సంస్కృత జ్ఞానముండేది. అపుడాకవి ఆమెతో అంటాడు

శ్లో॥ పానీయం పాతుమిచ్ఛామి త్వత్తః కమలలోచనే ।
యది దాస్యసినేచ్ఛామి న దాస్యసి పిబామిచ ॥ అని

అంటే, త్వత్తః = నీనుండి; పానీయం = నీరు; పాతుం = త్రాగడానికి; ఇచ్ఛామి = కోరుచున్నాను; యది = ఒకవేళ; దాస్యసి = ఇచ్చినట్లయితే; నేచ్ఛామి = కోరను; న దాస్యసి = ఇవ్వకపోయినట్లయితే; పిబామి = త్రాగుతాను.

ఇదేమి కోరిక? ఇస్తే త్రాగను. ఇవ్వకపోతే నీరు త్రాగుతాను అని శబ్దార్థాన్ని బట్టి స్థూలదృష్టికి అనిపిస్తుంది. ఆ పదాలను కొంచెం విరిచి చూచినట్లయితే మనకు అర్థమవుతుంది. యది దాస్యసి = నీవు దాసిదానివి అయితే న పిబామి = త్రాగను. న దాస్యసి = దాసిదానివి కాదు, నువ్వు మామూలు స్త్రీవైతే త్రాగుతాను. అని దాస్యసి అనే పదానికి రెండు అర్థాల కల్పించి అద్భుతమైన పదప్రయోగంతో చెప్పడం ఈ శ్లోకంలోని చమత్కారం. అవును మరి 'నిరంకుశాః కవయః' అన్నారు కదా! ఆ కాలంలో స్వేచ్ఛ ఉండేది. చమత్కారం రసగ్రహణ పారీణులైన శ్రోతలుండేవారు, ఆస్వాదించేవారు.

- ముత్యంపేట గౌరీశంకర శర్మ

కావ్యదోషాలు

డా॥ సూరం శ్రీనివాసులు

పదదోషాల్లో మూడవది గ్రామ్యం. 'అనియమాత్ గ్రామ్యం హి' అని ఆంధ్రశబ్దచింతామణి వచనం. దానినే 'లక్షణ విరుద్ధంబగు భాష గ్రామ్యంబు' అని చిన్నయసూరి నిర్వచించాడు. ఇక్కడ లక్షణమంటే వ్యాకరణం ప్రతిపాదించిన లక్షణం. ఆ అర్థంలో తీసుకుంటే గ్రామ్యం, అసాధువు – రెండు దోషాలూ ఒకటే అవుతాయి. కానీ ఇవి వేరువేరు. వ్యాకరణలక్షణవిరుద్ధం అసాధువు మాత్రమే వామనాదుల లెక్కలో. మరి గ్రామ్యమంటే ఏమిటి?



'లోకమాత్రప్రయుక్తం గ్రామ్యమ్' – 'లోకము నందే వాడుక గలది గ్రామ్యము'. లోకప్రయోగాలలో మాత్రమే కనబడుతూ శాస్త్రంలో ప్రయోగం లేనిది – ప్రయోగార్హం కానిది – గ్రామ్యం. ఈ గ్రామ్యానికి వ్యాకరణ సమ్మతమా? కాదా? అన్న ప్రసక్తి లేదు. వ్యాకరణం అంగీకరించినా సాహిత్య శాస్త్రం అంగీకరించదని భావం. కొన్ని పదాలు వాటి స్వరూపం కారణంగా కానీ, అవి ప్రతిపాదించే అర్థం కారణంగా గానీ, ఆ అర్థంతో సంబధమైన చేష్టా(క్రియా) విశేషం వల్ల గానీ, సాహిత్యంలో ప్రయోగానికి తగినవి కావు. అటువంటి పదాలను వాడడం గ్రామ్యం.

ఉదా: "పూత్కరించుచు నేచ్చెడు బొలతియయ్యె"

ఇక్కడి పూత్కరించు పదం గ్రామ్యం. పూత్కారమంటే బుస. పూత్కరించటమంటే బుస కొట్టడం. ఇలాగే చెక్కిలి అనే అర్థంలో గల్ల పదం, సొరంగం/బిలం అర్థంలో తల్ల పదం గ్రామ్యాలే. గల్ల తల్లపదాలు వ్యాకరణ విరుద్ధాలు కాకపోయినా సాహిత్యంలో వినియోగింపబడవు. కావ్యప్రకాశంలో "గ్రామ్యం యత్ కేవలే లోకే స్థితమ్" అని నిర్వచించి, 'కటి' పదాన్ని ఉదాహరణంగా చూపాడు మమ్మటుడు. వీటికి పర్యాయపదాలైన నితంబ, శ్రోణి పదాలనే విదగ్ధులు వాడుతారనీ 'కటి' పదాన్ని వాడడం గ్రామ్యమనీ మమ్మటాభిప్రాయం. "క్షోణీతలంబు నెన్నుదురు సోకఁగ మ్రొక్కి నుతింతు సైకతశ్రోణికి"(పోతన భాగవతం)లా శ్రోణి పదం కావ్యయోగ్యమని మమ్మటుడు. అంతమాత్రం చేత కటి పదం ప్రయోగాల్లో లేదనలేం. సంస్కృతమైనా, తెలుగైనా. మహాభారతంలో తిక్కన కూడా కటిపదాన్ని వాడాడు.

ఉరమునఁ గటిపైఁ దొడలం
జరణములం గౌరవేంద్రు చతురంగంబుల్
ధరఁ జాఁప కట్టువడ ని
ష్ఠురగతిఁ దాకుచు సమీరసుతుఁడు చరించెన్

భీష్మ – 2/221

ఒత్తుకొని వచ్చు కటి కుచోద్వృత్తి చూసి
తరుణి తనమధ్య మెచటికో తలఁగిపోయె
నుండెనేనియుఁ గనఁబడకున్నె యహహ!
యుద్ధతుల మధ్యఁ బేదల కుండఁ దరమె

కవికర్ణరసాయనము 3/26

కావ్యాలంకార సంగ్రహంలో రామరాజభూషణుడు మరికొన్ని పదాలను కూడా చేర్చాడు ఈ పట్టికలో –

పామరుల భాష గ్రామ్యము
భూమిని కటిగల్లములు విభాసిల్లుననన్
గోమలి చన్నులుఁ గన్నులు
గామిని పండువు లౌనన్చెఁ గడువడిననఁగన్

అప్పకవి 'కాళ్ళు' పదాన్ని కూడా ఈ పట్టికలో చేర్చాడు. అయితే ఈ పదాలలో – ఇటువంటి పదాలలో – చాలా పదాలను కవులందరూ వాడుతూనే ఉన్నారు. తల్ల గల్ల శబ్దాలను తప్ప.

తెలుగులో దొబ్బు, నూకు, ఎంగిలి, వాంతి, పుండు, ఉమ్ము ఇటువంటి క్రియా వాచకాలు, వాటిపై ఏర్పడే నామవాచకాలు గ్రామ్య కక్షలోనికి వస్తాయి. వీటిలో కొన్ని ఆయా ప్రాంతాలలో సభ్యపదాలు. అన్యత్ర అసభ్యపదాలు కాబట్టి గ్రామ్యాలు. కాబట్టి గ్రామ్యతాగ్రామ్యతలను నిర్ణయించటంలో దేశాన్ని బట్టీ, కాలాన్ని బట్టీ, ప్రాంతాన్ని బట్టీ, పాత్రను బట్టీ, సన్నివేశంలోని ఉద్రేకోద్వేగాలను బట్టీ ఆలోచించాలి. ఆ రీతిగా ఆలోచించిన తర్వాత కూడా సభ్యతాపరిధిలోనికి తేవడం కష్టమైనపుడు అటువంటివి తప్పనిసరిగా గ్రామ్యదోషాలే అవుతాయి. తెలుగులో ఈ మధ్య చాలా గ్రామ్యపదాలే నాగరక పదాలయిపోయాయి. స్త్రీపురుషభేదం లేకుండా అందరూ ఆనందంగా వాటిని వినియోగించుకొని ధన్యులవుతున్నారు. 1973లో దేశోద్ధారకులు చలనచిత్రంలో "ఆకలయ్యి అన్నమడిగితే పిచ్చోడన్నారు నాయాళ్ళు" అన్న పాట చాలా విమర్శకులకు గురి అయింది. ఆ గ్రామ్యపదప్రయోగం కారణంగా. అక్కడ ఆ పద వినియోగం ఒక నిస్సహాయమైన గొంతుక నుండీ వినిపించింది. అయినా ప్రజలు ఒప్పలేకపోయారు. అయితే ఈ రోజు ప్రధాన పాత్రలే – సినిమాల్లో అయినా కథలలో, నవలలో అయినా 'నా కొడక'

పదాన్ని అలవోకగా వాడేస్తున్నారు, ఆడా మగా అందరూ. ఇక 'దీనమ్మ జీవితం' పదబంధం షడక్షరిగా మారిపోయింది జనవినియోగంలో. భాషను మార్చుకొని నాగరికమైపోయిన పదం 'రేప్ చేయటం'. ఇక మీదట అయినా వీటిని వాడటం మానితే ఏదో ఒక దశలో అవి అంతరించిపోతాయి. అయితే నేనే భాషాభివృద్ధికి అడ్డుపడుతున్నా నంటారేమో అనే భయం లేకపోలేదు. ఇవన్నీ శిష్టవ్యావహారికంలో చొరబడిన పదాలు. ప్రాంత భేదాలతో మరెన్నో పదాలుంటాయ్. సాంస్కృతిక విషయ వినిమయం కూడా భాషాపరిణామానికీ, నాగరికీకరణానికీ కారణం కావచ్చు.

మహాప్రస్థానంలో 'దొంగలంజకొడుకులసలే మెదిలే ఈ లోకంలో' అని శ్రీశ్రీ అన్నప్పుడు ప్రజలెలా స్వీకరించారో తెలియదు. కాకపోతే ఎవరో ఒకరి తరఫున అందరినీ తిట్టడం కాబట్టి అందరికీ నచ్చే ఉండవచ్చు, తనను ఆ లోకం నుండీ మినహాయించుకొని. ఆంధ్రసాహిత్యంలో ఈ గ్రామ్యదోషానికి పెన్నిధి చంద్రరేఖావిలాపము. కూచిమంచి జగ్గకవి రచన. చంద్రరేఖావిలాసము అని ముందు వ్రాసి, ఆపై కృతిభర్త ఆ కృతిని తిరస్కరించినందులకు నిరసనగా మార్చి రూపొందించిన కృతి చంద్రరేఖావిలాపము. గ్రామ్యం అసభ్యం, అశ్లీలం అని రెండు రకాలుగా ఉంటుంది. చంద్రరేఖావిలాపం అశ్లీలానికి పరాకాష్ఠ. కొన్ని చాటువులలో కూడా ఆ గ్రామ్యపదాల ప్రయోగం విరివిగా, నిరాఘాటంగా కనిపిస్తుంది.

గునుగుపూలబాస (తెలంగాణ పద్యాలు-64) తుమ్మూరి రామ్మోహన్ గారి ప్రయోగ మొకటి గ్రామ్యంగా కనిపిస్తుంది.

మట్టివి గోడలింక మహమంచివి టేకువి గుంజలెన్నొ మా
గట్టివి మొద్దు దూలములు గాపయి వాసము లేటవాలుగా
దిట్టము గాగుదిర్చి పయి దె...ర పొంటిగ పెండె కట్టెల
ట్టిట్టుగ చేర్చుకుంట యిగ ఇంటిని గూనలతోడ గప్తరే -

ఇది తెలంగాణ పద్యం కాబట్టి ప్రాంతీయంగా అది వ్యవహారంలో ఉంటే ఉండవచ్చు. మరొక ప్రాంతంలో అది అభ్యంతరకరమైనపుడు వాడక పోవడమే యుక్తం. అన్యభాషలలో సభ్యమైనా మన భాషలో అసభ్యంగా / అశ్లీలంగా కనిపించే పదాలను వాడకపోవడం యుక్తం. భాషాస్వేచ్ఛ, ప్రాంతీయత, పాత్రోచితి పేర్లతో ఈ మధ్య ఇటువంటి రచన వ్యాప్తమైందని ఇంతకు ముందే చర్చించాం.

ప్రణయినిలో మరో అందమైన పద్యం. శ్రీ ఎన్.సి.హెచ్. చక్రవర్తిగారిది.

తాంబూలమేల? నధరములాను తరి నీ
యెంగిలికిc బెదవు లెర్రబారు
....
భూషలేల? యెదపైc బొరలాడినప్పుడు
ముద్రలే నగలయి పొలిచి నెగడు

ఇక్కడ ఎంగిలి, పొరలాడు పదాలు వ్యాకరణసమ్మతాలే. కానీ శృంగారవర్ణనలో సభ్యతాపరిధిని కొంచెం అతిక్రమిస్తాయి. ప్రాచీన కావ్యాలలో పొరలు వరకే ప్రయోగించేవారు, ఆడు లేకుండా. ఆధునికంగా దానికి ఆడు చేరింది. పొరలాడు అయింది. పొరలాడు పదాన్ని క్వాచిత్కంగానే వాడుతారు. ఎదపై పొరలాడటమన్నప్పుడు ఆ వ్యక్తీకరణ, పదప్రయోగం కొంత మేర గ్రామ్యాలే అవుతాయి.

అయితే ఇటువంటి పదాలూ, పదబంధాలు, చాలా చోట్ల కనిపిస్తుంటాయి గదా అని అడగవచ్చు. నిజం. అవి గౌణ ప్రయోగాలైతే రాణిస్తాయి. అభిధేయాలయితే అందానికి దూరమవుతాయి. కావ్యాదర్శంలో దండి-

నిష్ఠ్యూతోద్గీర్ణవాంతాది గౌణవృత్తివ్యపాశ్రయమ్ ।
అతిసుందర మన్యత్ర గ్రామ్యకక్షాం విగాహతే ॥

కావ్యాదర్శం 1/95

నిష్ఠ్యూతం(ఉమియబడినది), ఉద్గీర్ణం(కాంక్రించి/త్రేన్చి ఉమియబడినది), వాంతం(కక్కబడినది) ఇటువంటి పదాలు అభిధార్థంలో వాడితే గ్రామ్యాలు అవుతాయి. అవే పదాలను గౌణార్థంలో(అప్రధానార్థంలో) వాడితే అందగిస్తాయి. గౌణమంటే అన్యధర్మాలను, అన్యత్ర ఆరోపించడం. నిష్ఠ్యూత పదాన్నే "సూర్య కిరణాలు ఉమిసిన(చిమ్మిన)... ఇలా వాడితే ఇది గౌణం. ఇది అందం. తెలుగులో ఇటువంటి ప్రయోగాలు విరివిగానే చేస్తాం మనం.

తిక్కన -

ద్రుపదనందన పరిభవ దుఃఖమునకు
నుల్లమున దురపిల్లుచు నున్న సరసి
వేcడి నిట్టూర్పులో యన వెడలెc గ్రొత్త
తావి మూతులు విచ్చు నెత్తమ్మి విరుల - విరాట 2/236

నీరజాకరములు నిష్ఠమైc జేసిన
భవ్యతపంబుల ఫలమనంగ - విరాట 2/241

ఇంపైన ప్రియ కాననిచ్చి, నిల్చిన మధు
వాడట నాను మత్తాలి విభుని - విరాట 2/306

ఎంగిలిని ఎంత అందంగా అందింపజేశాడో తిక్కన.

పద్యపరీమళం

"రాజట ధర్మజుండు, సురరాజసుతుండట ధన్వి, శాత్రవో
ద్వేజకమైన గాండివము విల్లట, సారథి సర్వ భద్ర సం
యోజకుడైన చక్రి యట, యుగ్ర గదాధరుడైన భీము డ
య్యాజికి తోడు వచ్చునట, ఆపదగల్గుట యేమి చోద్యమో!

ఈశ్వరుండు విష్ణు డెవ్వేళ యెవ్వాని
కేమి సేయు పురుషు డేమి యెఱుగు?
అతని మాయలకు మహాత్ములు విద్వాంసు
లణగి మెలగు చుందు రంధు లగుచు"

(ఆంధ్ర మహాభాగవతం- ప్రథమ స్కంధం, పోతన)

ఉత్తరాయణ పుణ్యకాలంకోసం ఎదురుచూస్తూ అంపశయ్యపై ఉన్నాడు భీష్ముడు. అతడి వద్దకు కుంతీ పాండవులు వ్యాస కృష్ణులతో కలిసి వచ్చారు. తన కారణంగానే కురుక్షేత్ర సంగ్రామం జరిగిందని, రక్తపాతంతో వచ్చిన రాజ్యాధికారం తనకు వద్దని భావించిన ధర్మరాజు భీష్ముడి ఉపదేశంతో దారికి వస్తాడని ఆశించి, వ్యాసుడూ కృష్ణుడూ ధర్మరాజును తీసుకు వచ్చారు. వారందరినీ చూసి ఆనందించాడు భీష్ముడు. సంగతి చెప్పి, 'ధర్మరాజుకు కర్తవ్యం బోధించవలసిది'గా భీష్ముణ్ణి కోరాడు కృష్ణుడు.

అప్పుడు భీష్ముడు చేసిన సంభాషణలోనివి ఈ రెండు పద్యాలు.

"ధర్మరాజు చక్రవర్తి. ఇంద్రతనయుడు, ధనుర్విద్యా విశారదుడు అర్జునుడు. అతడి ధనుస్సు గాండీవం. అది శత్రు సంహారక శక్తి గలది. అతడి రథానికి సారథి సమస్త శుభాలనూ సమకూర్చగల శ్రీకృష్ణుడు. భయంకరమైన గదాదండం ధరించిన భీముడు ఆ యుద్ధంలో వారికి తోడుగా నిలుస్తాడు. అంతటి వారే అయినా పాండవులకు ఎన్నో కష్టాలు రావటం ఎంత ఆశ్చర్యకరమో! దైవం ఎవరికి ఎప్పుడు ఏమి చేస్తాడో, మానవులకు ఏమి తెలుస్తుంది? 'అతడి' లీలా విలాసాలకు మహాత్ములైనా, పండితులైనా ఏమీ తెలియని వారివలె తలవంచక తప్పదు" ఇదీ ఈ పద్యాలకు తాత్పర్యం.

సాధారణంగా మనం- "అసమర్థులు కష్టాల పాలవుతారు. సమర్థులైనవారు హాయిగా సుఖ జీవనం సాగిస్తారు"- అని అనుకుంటూ ఉంటాము. అందుకే ముందుగా భీష్ముడు పాండవుల పరాక్రమ సామర్థ్యాలను ప్రస్తావించాడు.

అఖండ భూమండలాన్ని ఏకచ్ఛత్రంగా ఏలుకోగల సార్వభౌముడు ధర్మరాజు. దేవలోకానికి వెళ్ళి కాలకేయ నివాతకవచులను సంహరించిన మేటి విలుకాడు అర్జునుడు. దేవతలకు సాధ్యంకాని ఈ రాక్షస సంహారకాండను అవలీలగా నిర్వహించి, స్వర్గలోకంలో అర్ధ సింహాసన గౌరవం అందుకో గలిగిన జగదేక పరాక్రమశాలి అర్జునుడు. శత్రుసంహార సామర్థ్యంగల గాండీవం అతడి ఆయుధం. ఇక, అతడి రథానికి సారథి సామాన్యుడా? సమస్త శుభ ప్రదాత. అతడే చక్రాయుధుడైన శ్రీకృష్ణుడు. గదాయుద్ధంలో ఆరితేరిన మహాబలశాలి భీముడు ఏ యుద్ధంలో అయినా వారివెంట ఉంటాడు. ఇంతటి సమర్థులే అయినా, పాండవులకు వచ్చినన్ని కష్టాలు అన్నీ ఇన్నీ కావు.

మనం మరో భావన కూడా చేస్తాం. 'ఎంత సమర్థులైనా, దైవానుగ్రహానికి నోచుకోలేకపోతే వారికి కష్టాలు తప్పవు'- అని అనుకుంటాం మనం. అందుకే - పాండవుల సామర్థ్యాన్ని ప్రస్తావించిన తరువాత కృష్ణుణ్ణి ప్రస్తుతించాడు భీష్ముడు.

"సర్వ భద్ర సంయోజకుడైన కృష్ణుడు" అర్జున రథానికి మాత్రమే కాదు, పాండవుల జీవిత రథానికే సారథి. సర్వ భద్ర సంయోజకుడు- అంటే సాక్షాత్తూ భగవంతుడే.

భగవంతుడే అండగా ఉన్నా, పాండవులు కష్టాలపాలు కాక తప్పలేదు- అంటున్నాడు భీష్మ పితామహుడు. అసమర్థులకు కష్టాలు తప్పవు. సమర్థులే అయినా, దైవానుగ్రహం పొందలేని వారు ఆపదలపాలు కాక తప్పదు. కాని, పాండవులు సమర్థులు. వారికి దైవానుగ్రహం పుష్కలంగా ఉన్నది. అయినా, కష్టాలు తప్పలేదని సారాంశం. అపారమైన సామర్థ్యమూ అసమానమైన దైవానుగ్రహమూ ఉండి కూడా అసాధారణమైన కష్టాలు తప్పవనేది దీనిద్వారా మనం గుర్తించాలని సారాంశం. ఈ సారాంశాన్నే సమర్థిస్తూ తరువాతి పద్యం కొనసాగింది.

"భగవంతుడు ఎప్పుడు ఎవరికి ఏమి చేస్తాడో ఎవరు చెప్పగలరు? అతడి లీలలూ మాయలూ మహాత్ములకూ విద్వాంసులకూ సైతం అంతుపట్టవు." మన జీవితంలో వచ్చే సుఖ దుఃఖాలకు కారణం మన ఊహకు అందేది కాదని, కష్టాలు వచ్చినంత మాత్రాన అసమర్థులమని భావించటమో, దైవానుగ్రహం లేదనుకోవటమో, మానవుల బలహీనత తప్ప, యథార్థం కాదని గుర్తించాలి. కష్టాల్లో క్రుంగిపోయి, సుఖాల్లో పొంగిపోయి, మానవుడు కర్తవ్యం విస్మరించరాదని, కష్టమూ సుఖమూ కూడా ఆ రూపంలో దైవం మనకు ఇచ్చే శిక్షణగా గుర్తించాలని సారాంశం.

సుఖ దుఃఖాలకు తట్టుకొని నిలబడే విధంగా మానవుడు తన్ను తాను మలచుకోవాలని, కష్టమైనా, సుఖమైనా మన కేదో నేర్పటానికే వచ్చిందని గమనించి, ఆ దిశగా మన ఆలోచనలకు పదును పెట్టి, కర్తవ్య శీలురం కావాలని భీష్ముని ఉపదేశ సారం.

- ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

అవధాన సౌరభమ్ - 4

-సాంప్రతి సురేంద్రనాథ్

అవధానము..అవధాని.. శతావధానము.. వంటి శబ్దములు కావ్యాలలో వినబడిన పదములే కాని ఆచరించిన వారి విధానమిట్టిదని కనబడినది లేదు కదా...దానికి కారణము అమోఘమైన సారస్వతసంపదను సమూలముగ నశింపజేసికొన్న మన 'తెలుగువారి' అసాధారణ అసామర్థ్యము.. అవివేకము. సరే, అది అలా వుంచి... ఒకవిధంగా పైన అనుకున్నది పరిశీలిస్తే అష్టభాషాప్రవీణులే అవధానిబిరుదవిరాజితులై ప్రకాశించినవారు. ఆకాలమున అష్టభాషలునేర్చుట సర్వసాధారణములు.

"సింహాసనద్వాత్రింశిక" కావ్యకర్త కొరవిగోపరాజు తాను "అష్టభాషాకోవిదుడ" నని చెప్పుకున్నాడు. చెప్పుకోవడమే కాక కావ్యావతారికలో నాలుగుభాషలలో రాజుగారిని ఆశీర్వదించి ఆ భాషలవైఖరి ప్రదర్శించినాడు. తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు వేంకటేశ్వరస్వామిమీద "అష్టభాషాదండకము" వ్రాసి "అష్టభాషాచక్రవర్తి" అన్న బిరుదుతో సత్కరింపబడినవాడు.. అయితే. ఆ అష్టభాషావైదుష్యమున అవధానమెట్లు ప్రకాశించినదో తీరు తెన్నులు కానరావు.

తిరుపతివేంకటకవుల సాహిత్యాధ్యయనంలో సువర్ణాధ్యాయం..

ఏనుఁగు నెక్కినాము, ధరణీంద్రులు మ్రొక్కఁగ నిక్కినాము, స
న్మానములందినాము, బహుమానములన్ గ్రహియించినార మె
వ్వానిని లెక్కపెట్ట కనివారణ దిగ్విజయం బొనర్చి ప్ర
జ్ఞానిధులంచు పేరుఁ గొనినారము నీవలనన్ "సరస్వతీ"

(తిరుపతివేంకటకవులు:నానారాజసందర్శనము)

ఈ పద్యం వెనుక ఉన్న కథ మనకు ఆ సందర్భాన్ని వివరించినా వారికి ఇంత ప్రతిష్ఠ, అనన్యసామాన్యమైన గౌరవము, సమ్మానము. ఇంతటికీ కారణం వారి అవధానప్రతిభ, ఆ అవధాన విద్యా ప్రాభవము, అదొక్కటే వారి నందలములెక్కించి నానారాజసభాస్థానములలో అనన్యసామాన్యగౌరవములతో ఆధునికాంధ్ర సాహిత్యమున అవధానకళాసామ్రాజ్యమునకు సార్వభౌములుగ పట్టాభిషేకమొనరించినది.

తిరుపతివేంకటకవులకాలమునకు కేవలము "అష్టావధానము" మాత్రముమిగిలి, మహానుభావుడు మాడభూషి వేంకటాచార్యుడు అక్కడక్కడ అపురూపముగ చేసిన అవధానములే. బాల్యావస్థలో మాడభూషి వేంకటాచార్యులవారి అవధానమును చూసిన చెళ్లపిళ్ళ వేంకటశాస్త్రిగారికి.. అదే అష్టావధాన రూపకల్పనకు స్ఫూర్తినిచ్చింది.

అయితే అష్టావధానం సరే... ఆనాటికెవ్వరూ, ఎన్నడూ కని యెఱుఁగని శతావధానం. అదెలా..

తిరుపతివేంకటకవులు అష్టావధాన శతావధానములకు రూపకల్పన చేసిన అవధానకళా బ్రహ్మలైన అలౌకికప్రజ్ఞా ధురంధరులు, ఉభయభాషాసారస్వత కవితాత్రైలోక్య పురందరులు అని అనుకున్నాము కదా.. అవధానవిద్య అంటే అష్టావధాన శతావధానాలు కదా.. అందులో.. 'అష్టావధానం' సరే.. ఏకకాలంలో ఎనిమిది అంశాలనిర్వహణ. ఇలాంటి వినోదం మాడభూషి వేంకటాచార్యులువారు నిర్వహించిన అష్టావధాన ప్రక్రియను బాల్యంలో చూచిన చెళ్ళపిళ్ల వేంకటశాస్త్రిగారు అష్టావధానమంటే ఏకకాలంలో చేసే ఏ ఎనిమిది అంశాలైనా అని కాకుండా.. ఆ సాహిత్యప్రక్రియను కవిత్వం, ధారణ ప్రధానంగా రూపొందించి ప్రదర్శించినారు అని కూడ అనుకున్నాము కదా..

ఈనాడైతే ఈ అవధాన పదప్రశస్తి జారిపోయి ఒక గంట కాలంలో ఎనిమిది మందితో మాట్లాడితే చాలు.. అదే అవధానం అనే హాస్యావధానాలు, అపహాస్యప్రధానాలు, విపరీతధోరణులు విస్తరించి.. విస్తరిస్తూ.. 'కరఁగెఁ బోఁబో నీళ్ళకున్ బల్చనై' అన్నస్థితికి వచ్చింది. సరే... ప్రజాస్వామ్యం కదా.. 'యేన కేనా వ్యపాయేన ప్రసిద్ధో మనుజో భవేత్'

(3వ పేజీ తరువాయి) **సత్కవి ప్రతిభకు తార్కాణం**

కమలబాంధవుడైన సూర్యుడు కలువులకు శత్రువు. భానూదయంతో కలువలు ముకుళించుట ప్రకృతి సిద్ధము. ఇచ్చిన సమస్య ప్రకృతి విరుద్ధము, కవిసమయ విరుద్ధము కూడా. చంద్రోదయంతో కలువలు వికాసాన్ని సంతరించుకోవడం సహజసిద్ధము.

"దంపతులకు ఆత్మానందము నింపగా, జారులకు చోరులకు గుండెలు సంచలింపగా, ఇంపైన వెన్నెల వన్నెలను కురిపిస్తూ రోహిణీ హృదయపద్మ భాస్కరుడగు సుధాకరుడు(చంద్రుడు) ఉదయింపగా కలువ వికసించినదని కమనీయమైన పూరణ.

ఈ పూరణంలో 'జంపతుల' అనుపదం ఆ సోదర కవుల వ్యాకరణ వైదుష్యానికి ప్రతీక. ద్వంద్వ సమాస ప్రకరణంలో జాయా చ పతిశ్చ – దమ్పతీ – జమ్పతీ – జాయాపతీ అను రూపాలు సిద్ధాంతకౌముదిలో చూపబడినాయి. "జాయా శబ్దస్య జమ్భావో దమ్భావశ్చ వా నిపాత్యతే" అని అక్కడ వృత్తి చెప్పబడింది. ఇలాంటి పదప్రయోగాలతో కవులు తమ శబ్దాధికారాన్ని నిరూపించుకొంటూ పద్యాన్ని విలక్షణంగా తీర్చిదిద్దవచ్చు.

ఈనెల అంశం: మహిత మార్గశీర్షం

పెనుకొండ రామబ్రహ్మం బెంగుళూరు

శా. హేమంతంపు తుషార బిందు విలసద్వేలన్ విరాజిల్లఁగన్
ధీమంతంబుగఁ బుష్ప పత్రదళముల్ దీపించి కల్యమ్మునన్
సీమంతంబున శోభలన్ దనెరిడిన్ సీమంతినిన్ బోలవే
ప్రామాణ్యమ్ముగ నెంచఁగన్ బ్రకృతి యుద్భాసిల్లు నారీతిగన్

శిఖరిణి
శరత్కాలాంతంబా విధినిఁ జలి సంజాతముఁ గనన్
ధరన్ హేమంతంబొప్పు హిమభృత సంస్థానమలరన్
దరించంగన్ సీమంతిని పగిది యందంబుఁ గనుచున్
విరాజిల్లున్ స్వచ్ఛమ్ముగఁ బ్రకృతి సంప్రీతి మెరయన్

ఇంద్రవజ్ర
ధీమంత సౌందర్యపు తేజ మొందన్
సామంతమే లేక తుషార ధారా
శ్రీమంతమేపార విశిష్ట రీతిన్
హేమంత సీమంతిని హృద్యమౌ దాన్

శా. హేమంతంబున మార్గశీర్షముననా యిందీవరున్ శ్రద్ధతో
ప్రేమాసక్తిని నిల్పి భక్తిఁగనుచున్ వేడంగ సీమంతినుల్
నేమమ్మున్ విడకుండ వత్సలుఁడు మన్నించున్ సదా ప్రోచెదున్
భామల్ మ్రొక్కరె పుష్య మాసమున సంభావించి యాదిత్యునిన్!

ఉ. పంతముఁ బూనుచున్ బ్రకృతి భాసిలు కాలము మోదమొంద హే
మంతము శీతలంపు పొగమంచు ప్రభాతము నందు నిండి సీ
మంతిని తెల్లచీర కడు మక్కువ మీరఁగఁ గట్టినట్లుగన్
వింతగఁ దోఁచు రమ్యముగఁ బ్రీతిని హేలగఁ బంచు నుద్ధతిన్

గట్టెడి విశ్రాంత్

శా. ఓ హేమంతమ! నీవు వచ్చు తఱి మేమూహింప రానట్టి శీ
తాహార్యమ్ముల బూనియుండి, సకలాశాంతమ్ములన్ నిండి వా
ర్వాహాలందున నున్న నీరు హిమమై బాగొప్ప కాలూనెదో
ఈ హిందూ ధరపై శరత్తువిడగా నీద్యప్రభారాశితో

మ. సరె నీ వాగమనంబొనర్చితివి మా సాహిత్య సౌహిత్యులిం
కరయం స్వాగతమిచ్చి నీ స్తుతులనే యాలాపముం జేతుర
చ్చెరు వింతైనను గాదుబీ కాని యిపుడేఁ జెప్పంగనున్నాడ హె
చ్చరికన్నీకొక డాలకించెదవొ, నచ్చన్, దాని పాటింతువో.!

ఉ. నచ్చకపోదు నీ కనుచు నమ్మితి గాన వచించుచుంటి నా
హెచ్చరికిద్ది సుమ్మబీ కడు హీనులు, దీనులు, పేదవారు నీ
కెచ్చట నైన కన్పడిన నించుక దూరములోన నుండుమా
వెచ్చదనమ్ము వారి కడ వీక గ్రహింపక సాగిపోవుమా

ఖండశర్కర

నిర్వహణ: శతావధాని ఎం.వి. పట్వర్ధన్
అష్టావధాని చేపూరి శ్రీరామ్

ఉ. నీ వలనన్ ప్రయోజనము నిక్కముగా నొకటున్నదోయి క్షు
త్పావక దగ్ధులైన జనతానిచయంబదనమ్ము సుంత ని
ద్రావశులై స్వబాధలను తప్పక నేమఱు చుందురింక రే
పీవిధి నుండ బోదనుచు నిమ్ముగ నాశలు పల్లవించగన్ .

కం. నానుడువులపాటించెదొ?
ఏ నడకల సాగుచుండి యెటకేగెదవో
మానుగ వర్తించి జనుల
చేనుతులను పొందుమింక సీమంతినివై.

అసనారె

క. క్షేమమ్ములు కలిగించును
భూమిపయిన నున్న ప్రజకు భూరి ఫలములన్
హేమంతమ్ము ప్రకృతికిన్
చేమంతుల మాలవేసి చెన్నును గూర్చున్

తే. ఉత్తరపు గాలి రయమున నుద్భవించ
చదలుపై కనుమరుగయి చలువరేడు
దంపతుల దరిచేర్చు కందర్పకుండు
కమలముల పెరిమ తరుగు, కప్పు మంచు

తే. పగటి కాలము క్రుంగి పెరుగును రేయి
ప్రజలను వణికించును చలి రాత్రివేళ
దహనమే హిత మయ్యెను ధరణిపయిన
పరుగుపరుగున రవి చేరు పశ్చిమాద్రి

క. చలిబారి పడిన జంటల
కలతల దరిచేరనీక కౌగిళులందున్
కలుపును హేమంతఋతువు
నిలుపును జీవితములెల్ల నిశ్చలపు గతిన్

ఉ. చయ్యన పుష్పసాయకుని చాప శరమ్ములు విక్రమింపగన్
పయ్యెదలోన చోటునిడి భర్తల కౌగిలిలోన జేర్చుచున్
చయ్యన ఖైదు చేయగను చక్కని వేడి జనించి శీతమున్
వ్రయ్యలు చేయ శీఘ్రముగ, పండును వారల కోడె కోరికల్

ముంజంపల్లి వీరబ్రహ్మేంద్రాచార్య

శా. శీతాకాలము దెచ్చి నీవు నిలుపం జెందె న్నిశల్ దీర్ఘమై,
వాతశ్లేష్మము లుద్ధృతంబు లగుచున్ వర్తిల్లుచుండెన్ భువిన్,
శీతాంశుం గనకుండి రాలుమగలున్ జేరింటిలో నొక్కటై,
యే తీరు న్నుతియింతు నీదు మహిమన్, హేమంత సీమంతినీ!

శా. నాతుల్ నాథులు నిష్టకాల మనుచున్ మార ప్రబోధాత్ములై,
చేతుల్ గల్పిరి దేహ సంగమ సుఖాసీనత్వ కాంక్షార్థులై,
ప్రీతిం గౌగిళులందుఁ గల్గు సుఖమున్ వేగంబుగా నందగా
నే తీరు న్నుతియింతు నీదు మహిమన్, హేమంత సీమంతినీ!

శా. పూతంబైన సుమంగళ వ్రతమునన్ బుత్రార్థులై దంపతుల్
చేతోమోదము నంది, దీక్షఁ గొనియుం జిత్తంబులున్ రంజిలన్
శీతాకాలము దైవదత్త మనుచున్ జింతింతు రాకాంక్షతో
నే తీరు న్నుతియింతు నీదు మహిమన్, హేమంత సీమంతినీ!

శా. శీతాకాలము వచ్చి చేరె నయయో, చేతుల్ వడంకెన్, సదా
వాతోద్దీపితమై తనూలతికలే వారించె బాహ్యస్మృతుల్,
నాతుల్ జేరిరి నాథు సంగమునకై,నవ్యాంగ సందీప్తులై
యే తీరు న్నుతియింతు నీదు మహిమన్, హేమంత సీమంతినీ!

శా. తాతల్ శైత్యముచే వడంకిరి కదా! తారుణ్యమున్ బాసియుం
జేతం బందునఁ బూర్వకాల విభవాశ్లేషంబు లిక్కాలమం
దైతిహ్యంబులుగాఁ దలంచి, వెస నా హాయిన్ స్మరించున్ సదా
యే తీరు న్నుతియింతు నీదు మహిమన్, హేమంత సీమంతినీ!

డా.రఘుపతి శాస్త్రుల

శా. హేమంతమ్మున పృథ్వి యంతయు దెసల్ హేమంపు వర్ణమ్మునన్
క్షేమైశ్వర్య విశేష సత్ఫల సౌశీల్యమ్ములన్ చాటుచున్
సీమంతమ్మున వన్నెలొల్కు తరుణీ శృంగారమట్టుల్ కనన్
శ్రీమంతమ్ములనొల్కుచుండు జనులన్ శ్రీమంతులన్ జేయుచున్

చం. ప్రకృతి మనోహరమ్ములగు పచ్చని వస్త్రములన్ ధరించి వ
చ్చికుసుమ కోమలమ్ములగు శ్రీ లను మేని నలంకరించు శో
భ కనులవిందు జేయుచుసువర్ణపు కాంతులు పృథ్వి యంతటన్
సకల శుభ ప్రదమ్ములుగ సన్నుతులొప్పగ విస్తరింపవే!

చం. సరిగన శీతలాస్పదపు సాంద్ర మనోహర దివ్య కాంతులున్
పరిపరి రీతులన్ ప్రకృతి వన్నెల చిన్నెల చిందు దృశ్య మం
దరికిని మేను పుల్కలను తత్పరతన్ కలుగంగ పౌష్యమం
దరయగ దైవమే మనకు నాదర రీతి నొసంగెనో కదా

ఉ. పౌష్యమునందె భానుడు నపారమునౌ సిరులంద జేయుచున్
భాష్యము చెప్పగన్ దిశల పారెడు నట్టి మృదుత్వ క్రాంతులన్
శిష్యుల బోలు ప్రాణులకు శిష్ట పదోన్నతి గూర్చనెంచి తా
పుష్యమి రాగ సంపదల బ్రోవగ వచ్చెనొ యుత్తరమ్ముగన్

ఉ. కాలపరీక్షలెప్పుడును క్రాంతి నొసంగుచు నుండ మేల్మియౌ
పాలకులందరున్ జగతి స్వార్థము వీడి చరించు నట్టులా
పాలసులన్ వధించుచు వివర్ధన రీతుల ధర్మ సత్కృతిన్
కాలుడె మార్చు గావుత సకాల పరీక్షల నెన్నుచున్ సదా!

శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ

శా. హేమంతంబిది హేలనింపు మది నే మేమో రసాస్వాదనల్
ప్రేమన్ జిల్కి శ్రుతించి పుష్పపథ ధాత్రిందీరు హృద్భాసమై
యామారున్ నవహాసముల్ చెలగ దీ పించున్ గదా వన్నె లా
రామంబున్ వికసించ నెల్లెడల సాంద్రంబౌచు నీ ధాత్రిపై!

చం. చలియన భీతియేలనొ! రసార్ద్రత నింపుచు జూడ సీతు సం
జల నిల జేకొనన్ దగును జాలగ నించుక యగ్నిగీతికల్
మిలమిలలాడ సంపదల మేన ధరించి వరించు వేళయం
దిల ప్రసరించుగాదె రహి యించెడి దివ్య మహద్యుతిప్రభల్!

ఉ. మేనున మంచు గప్పుకొని మేదిని యందలరారు యోగమున్
దాను ధరించి మించి ఋతు తత్త్వమునందగ జేసి కాలమున్
గానగజేయు గాదె రుచి, కల్పనలో నటియించు లోకమం
దీ నవచేతన క్రమత నెంచ యుగాల వరమ్ము నీ కిలన్!

ఉ. ఆమె మనోజ్ఞ రూపమున నాశ్రయ మందును ప్రేమరాగముల్
ఆమె సుశీతలామృత విహాయసమందు చరించు కోర్కెలున్
ఆమె విశాల నేత్రదృశి నావహమందును మాధురీకృతుల్
ఆమెను పాడలేని దిన మావనిదా! హిమరాగశోభలన్!

ఉ. శారద రాత్రులం దొనరు సాంద్ర వినీల ప్రకాశరాగముల్
చేరగ మానసమ్మిక రచించునుగాదె విలాస గీతికల్
తీరుగ నిల్చి విస్మృతిని తీయని హాయిని బంచి యూహలన్
భారము ద్రుంచు నీ యవని భామిని సుందర లాస్యవేదికన్!

తదుపరి అంశం

తుషార లాస్యం

పై అంశానికి 5 పద్యములను 9441039146
ఫోన్ నంబరుకు వాట్సప్ ద్వారా పంపగలరు
ఖండికలు పంపవలసిన ఆఖరు తేది
15 జనవరి 2026

సంస్కృతం సంస్కృతి 4

నారుమంచి వేంకట అనంతకృష్ణ శర్మ

సంస్కృతభాషా పరిజ్ఞానము యొక్క ఆవశ్యకత ఈ వ్యాసములో మరొక కోణములో చూద్దాం. సంస్కృతి చాలా విస్తృతమైనది. ప్రత్యేక సమాజములోని సమూహము యొక్క ఆచరణలో ఉన్నటువంటి ఆచారవ్యవహారాలు ఆ ప్రాంతములోని సంస్కృతి అవుతుంది అని చాలా స్థూలమైన నిర్వచనముగా చెప్పుకుందాం. ఆచారవ్యవహారాలంటే కేవలం వైదిక ఆచార వ్యవహారములే కాక లౌకిక, ప్రాంతీయ విషయాలు కూడా వాటిలో అంతర్భాగ మౌతాయి కదా.

అవధాని కేవలము తన ప్రాంతములోనే అవధాన ప్రదర్శన చేయడు. లబ్ధప్రతిష్ఠులైనవారికి, కావాలనుకున్నవారికి కూడా విస్తృతసంచారము తప్పనిసరి. కనుక ఆయా ప్రాంతాలలో ఉన్న ఆచారవ్యవహారాలు క్షుణ్ణముగా తెలియాలి. కనీసం అప్పటికప్పుడైనా తెలుసుకోవాలి. ఉదాహరణకి తిరుపతిలో అవధానం అనుకోండి కేవలం స్వామిగురించి కాకుండా స్థానిక గంగానమ్మ జాతర గురించి అడగవచ్చు కదా.

అలాగే అవధానము చేసే సమయము కూడా ప్రాధాన్యత వహిస్తుంది. ఉదాహరణకి కార్తికమాసములో అవధానము చేస్తున్నట్లైతే ఏదో ఒక అంశములో కార్తికమాస వైశిష్ట్యము గురించిన ప్రశ్న వచ్చి తీరుతుంది. కనుక ఆ ప్రాంతములో ఆ కాలములో చేసే విశేషాలపై అవగాహన ముందుగా సంపాదించుకోవాలి కదా. అంటే కార్తికములో చేసే దీపదానం, జ్వాలాతోరణం. ప్రాతఃకాల స్నానాలు, గ్రంథపారాయణ, ఆచరించుట వలన ఫలితములు ఇలా వీటి గురించి తెలియాలిగా. లేదా కార్తిక పురాణములోని ఒక ఘట్టాన్ని ప్రశ్నించవచ్చు. అంటే పురాణజ్ఞానము కనీసస్థాయిలోనైనా కావాలి కదా.

మరొక విషయం. ప్రసిద్ధ కవులు లేదా వ్యక్తులు పుట్టిన ప్రాంతములో అవధానము చేస్తున్నప్పుడు ఆయా విశిష్ట కవుల జీవితాలపైన కానీ వారి రచనలపైన కానీ ప్రశ్నించవచ్చు. అంటే ఆ కవి రచనలు, అతని జీవనచిత్రము తెలిసి ఉండాలి, లేదంటే గురికి బారెడు దూరము నుంచి బాణం పోయినట్లు పేలవముగా పద్యం పుడుతుంది. ఇది ఇలా ఉండగా, ఒక అంశము కానీ, కథ కానీ పురాణాలలో ఒక విధముగా ఉండి కావ్యాలలో మరొక విధముగా నిర్వహించబడి ఉండవచ్చు. అలాగే పురాణాలలో కూడా ప్రక్షిప్తాలవల్ల, ఇతర కారణాల వల్ల ఒకే కథ భిన్నభిన్న రీతులలో ప్రచారములో ఉండవచ్చు. ఇది అందరికీ అనుభవమే కదా.

సంస్కృతములోనే అనేక పురాణాల మూలములు ఉన్నాయి. అనువాదాలు ఉన్నప్పటికీ మూలభావము సంస్కృతములో చదివితేనే అవగతమౌతుంది. తెలుగు ప్రబంధాలు కూడా పరిశీలించాలి. పాండురంగమాహాత్మ్యం చదివినప్పుడు పురోణిలో కవికాలాదులు, కవి వైశిష్ట్యము తెలుస్తే, గ్రంథములో పండరిపుర క్షేత్రవైభవము విశేషాలు తెలుస్తాయి. అది కాక ప్రబంధకవులు తమ కావ్యాలలో విస్తృతముగా సంస్కృతప్రయోగాలే చేసారు. నన్నయ్యగారి శ్రీవాణీగిరిజా... పద్యం కేవల సంస్కృతం కదా. అలా ఆలోచిస్తే ప్రబంధాలు కూడా సంస్కృతసాహిత్యముగా అవధాని పరిగణించవచ్చు. సంస్కృతమును తెలుగును వినియోగిస్తూ దుష్టసమాసాలు రాకుండా ఎలా పదబంధాలు నిర్మించవచ్చునో ఇక్కడ అనుభవపూర్వకముగా తెలుసుకోవచ్చు.

పురాణములు, కావ్యములు, ప్రబంధసాహిత్యము మాత్రమే కాకుండా సంస్కృతములో సమకాలీన రచనలు కూడా తప్పక అనుశీలన చేయాల్సినదే. పద్మశ్రీ శ్రీభాష్యం విజయసారథిగారు సమకాలీన సంస్కృత కవి. వారి రచనలు ప్రస్తుత సమాజానికి దగ్గరగా ఉన్నవి అలాగే శాస్త్రీయవిషయాలపైనా ఉన్నాయి. వారు వ్రాసిన సంస్కృతరూపకములలో నాందీ ప్రస్తావనలు అన్న గ్రంథములో వారు ఎందరు నాటకకర్తలను వారి నాటకాలను పేర్కొన్నారో చూస్తే వారి పరిశ్రమకి ఆశ్చర్యము కలుగక మానదు. ఇలాగే అనేకమంది సమకాలీన సంస్కృత కవులు రచయితలు ప్రస్తుతసమాజానికి అద్దం పట్టే సాహిత్యసృష్టి చేస్తున్నారు.

ఓహో! ఇంత సాహిత్యమున్నదా అని ఆశ్చర్యపడుటకంటే వాటిని కేవలం చదువుట కాకుండా అధ్యయనం చేయడం విశేషఫలమిలిస్తుంది. గమనించండి, మీకు తెలిసిన లబ్ధ ప్రతిష్ఠులైన అవధానులందరూ ఇలాంటి అధ్యయనం చేసినట్లు వారి మాటలలో, వారి పూరణలలో తేటతెల్లమౌతుంది. కనుక సాహిత్యానుశీలనము నిత్యకృత్యముగా చేసికొన్న అవధానికి ప్రపంచమే రంగస్థలం అయితీరుతుంది.



22.11.2025 తేదీన రవీంద్రభారతి వేదికపై

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నితానందరావు గారి

చేతుల మీదుగా విడుదల అవుతున్న అవధాన పుష్కరిణి మూడవ సంచిక.

చిత్రంలో ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి, బాలాంత్రపు వేంకటరమణ,

చింతా రామకృష్ణారావు, డా. ఏల్చూరి మురళీధరరావు,

‘దర్శనమ్’ సంపాదకులు మరుమాముల వేంకటరమణశర్మ

ప్రభృతులు ఉన్నారు.

అవధాన విద్యా విజయతే తరామ్

Avadhana Puskarini
22 December 2025



అవధాన పుష్కరిణి సంచికను చూసి ఆశీస్సులు అందించిన అవధూత పీఠాధిపతులు

అప్పాజీ (శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ)

Published by
Avadhana Vidya Vikasa Parishat
Sri Rama Sadanam, 29-1499/6/1, Road No.1
West Kakatiya Nagar, Neredmet, Secunderabad - 500056
Ph: 9441039146